# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## వ్యక్తి దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ

పలమనేరు,ఆగస్టు 17,ప్రభాతవార్త: పలమనేరు ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన గురువారం చోటు చేసుకుంది.పట్టణంలోని సిల్క్ ఫామ్ సమీపంలోని వ్యవసాయ పొలంలో ఓ వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు తలపై బండరాయితో కొట్టి దారుణంగా హత్య చేశారు.స్థానికులు మృతదేహాన్ని గుర్తుంచి పలమనేరు పోలీసులకు సమాచారం అందించడంతో సిఐ చంద్రశేఖర్,ఎస్ఐ సుబ్బారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి మృతుడి వివరాలు హత్యకు గల కారణాలను ధర్యాప్తు చేస్తున్నారు.

### ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి

## విడిపోయిన ల్యాండర్

**- థ్యాంక్స్ ఫర్ ద రైట్...మేట్- ల్యాండర్ నుంచి ఇస్రోకు సమాచారం**
**- షార్‌లో శాస్త్రవేత్తల సంబరాలు**




ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్ వేరవుతున్న దృశ్యం

శ్రీహరికోట (తడ), ఆగస్టు 17 ప్రభాతవార్త చంద్రయాన్-3 ప్రయోగంలో గురువారం మధ్యాహ్నం కీలక ఘట్టం విజయవంతం కావడంతో శ్రీహరికోటలోని శాస్త్రవేత్తలు సంబరాలు చేసుకుంటున్నారు. ఇక ఈ నెల 23న చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ జరిగి తీరుతుందని నమ్ముతున్నారు. గత నెల 14న శ్రీహరికోట నుంచి మన బాహుబలి రాకెట్ ద్వారా ప్రయోగించిన చంద్రయాన్-3 చివరి అంకానికి చేరుకోవడంతో షార్ శాస్త్రవేత్తల్లో ఉత్సాహం ఇనుమడించింది. దీనికి తగ్గట్లే గురువారం మధ్యాహ్నం ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి విడిపోయిన ల్యాండర్ నుంచి థ్యాంక్స్ ఫర్ ద రైట్..మేట్ అనే సమాచారం బెంగళూరులోని ఐఎస్‌టిఆర్ఎసిలో ఉన్న కేంద్రానికి అందినట్లు ట్విట్టర్ వేదికగా ఇస్రో ప్రకటించింది. చంద్రుడి ఉపరితలంపై ల్యాండర్ దిగే సమయంలో దాని నిలువు వేగం సెకనుకు రెండు మీటర్లు ఉండేలా హారిజంటల్ వేగం సెకనుకు 0.5 మీటర్ల కన్నా తక్కువగా ఉండేలా శాస్త్రవేత్తలు భూకేంద్రాల నుంచి నియంత్రించనున్నారు.

## తోపుడు బండిపైకి దూసుకెళ్ళిన కారు

# ఇద్దరు దుర్మరణం

**తాహాశీల్దారు సహా మరొకరికి గాయాలు**



చెరువులోనికి దూసుకెళ్ళిన కారు





ప్రమాదంలో మృతి చెందిన తులసి, దొరస్వామిరెడ్డి

గంగవరం, ఆగష్టు 17, ప్రభాతవార్త : రహదారి పక్కన ఉన్న తోపుడు బండిపైకి ఓ కారు దూసుకెళ్ళిన ఘటనలో ఓ వివాహిత దుర్మరణం చెందగా తాహాశీల్దారుతో పాటు మరొకరు గాయపడ్డ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.మేలుమాయి గ్రామానికి చెందిన దొరస్వామిరెడ్డి(45) ఇతని మేనకోడలు తులసి(28) లు స్థానిక మదర్‌తెరిసా కళాశాల ముందు పలమనేరు,మదనపల్లె జాతీయ రహదారి పక్కన తోపుడు బండిపై వేరుశనిగకాయలు, మొక్కజోన్నలు అమ్ముకొని జీవనం సాగించేవారు.ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కళాశాల ముందు రహదారి పక్కన యదా విధిగా తోపుడు బండి వద్ద దొరస్వామిరెడ్డి,తులసీలు వేరుశనిగ కాయలు విక్రయించుకుంటున్నారు.మండలంలోని సాయినగర్ సమీపం లోని ద్వారకామయి వీధిలో నివాసం ఉంటున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సోమల మండల తాహాశీల్దారుగా విధులు నిర్వహిస్తున్నాడు. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి బందువులు మదనపల్లెలో మృతి చెందడంతో అక్కడ అంత్యక్రియలకు హాజరై తిరిగి కుటుంబ సభ్యులతో కలిసి కారులో వస్తూ అతి వేగంగా, అజాగ్రత్తగా తోపుడు బండిపైకి దూసుకెళ్ళినట్లు స్థానికులు పేర్కొన్నారు.ఈ ప్రమాదంలో తులసి దాదాపు 20 అడుగుల ఎత్తుకు ఎగిరి రహదారి పక్కనే ఉన్న చెరువులోని ముళ్ళ పొదల్లో పడి అక్కడికక్కడే దుర్మరణం చెందగా దొరస్వామిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.ప్రమాదానికి కారణమైన కారు చెరువులోకి దూసుకెళ్ళింది.విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం వేలూరు సిఎంసికి తరలించారు. మృతదేహన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దొరస్వామిరెడ్డి వెలూరు సిఎంసిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తాహాశీల్దారు శ్యామ్‌ప్రసాద్ రెడ్డి మద్యం మత్తులో కారును నడపడం వలనే ఈ ప్రమాదం జరిగిందని,ప్రభుత్వ నిబంధనలను అమలు చేయవల్సిన మండల మేజిస్ట్రేటే పూటుగా మద్యం సేవించి ప్రమాదాలు చేసి అమాయకుల ప్రాణాలను బలికొంటుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని స్థానికులు విమర్శిస్తున్నారు.

## శేషాచలంలో "ఆపరేషన్ చిరుత"!

**-భక్తుల భద్రతే ధ్యేయంగా సిసికెమెరాలు, బోనులు**
**-చేతికి కర్ర ఇచ్చి చేతులు దులుపుకోవడంలేదు- టిటిడి చైర్మన్ కరుణాకర్ రెడ్డి**



తిరుమల,ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి దర్శనానకి వచ్చే భక్తుల భద్రత దృష్ట్యా ఆపరేషన్ చిరుత కొనసాగిస్తామని టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పునరుద్ఘాటించారు. తిరుమల నడకదారిలో గురువారం చిరుత బోనులో వేకువ జామున చిక్కింది. 15వతేదీ అర్ధరాత్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో సంచరించినట్లు సిసికెమెరాల్లో గుర్తించగా 16వతేదీ అర్ధరాత్రి 1.30గంటలకు బోనులో చిరుత బంధీ అయ్యింది. బోనులో పట్టుబడిన చిరుతను గురువారం ఉదయం టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డితో కలిసి కరుణాకర్ రెడ్డి పరిశీలించి అటవీశాఖ అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలినడక మార్గంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కార్యచరణ రూపొందించి అమలు చేస్తామని ,బోనులో చిక్కిన చిరుత మగ చిరుతగా అధికారులు నిర్ధారించారన్నారు. భక్తులకు భద్రత కల్పిస్తూనే నడకమార్గంలోకి వచ్చే చిరుతలను బంధించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అటవీశాఖ అధికారుల ప్రతిపాదన,సూచనల మేరకే నడచి వచ్చే భక్తులకు చేతి కర్రలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయం సమీపంలోని 500 మీటర్ల పరిధిలో రెండు చిరుతలు సంచరిస్తున్నట్లు ఈ నెల13న గుర్తించగా 14న, గురువారం తెల్లవారుజామున చిరుతలు బోనులో పడ్డాయి.

### తిరుమల భద్రతకు

## మూడంచెల తనిఖీలు బలోపేతం

**అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద అదనంగా మరో నాలుగులేన్లు**
**-మాఢవీధుల్లో ఆయుధాలతో క్యూఆర్‌టి టీమ్ గస్తీ**



తిరుమల,ఆగస్టు 17 ప్రభాతవార్తప్రతినిధి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ భద్రతను మరింత బలోపేతం చేస్తూ రాష్ట్ర హోమ్‌శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంతోబాటు లక్షలాదిమంది భక్తుల భద్రతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించుకుంటూ అధునాతన సిసి కెమెరాలను ఏర్పాటుచేసేలా నిర్ణయించారు. అలిపిరిలోని సప్తగిరి తనిఖీకేంద్రం వద్ద అదనంగా మరో నాలుగులేన్లు, అదనంగా వాహనాల తనిఖీ స్కానర్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. తిరుమల ఆలయం భద్రత, భక్తుల రక్షణ విషయంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ నిఘావర్గాలకు చెందిన ఉన్నతాధికారులు రాష్ట్ర హోమ్‌శాఖ ముఖ్యకార్యదర్శి హరీష్‌కుమార్‌గుప్త, ఐఎస్‌డబ్ల్యు ఐజి శశిధర్‌రెడ్డి, తిరుపతి జిల్లా ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి, తిరుమల అదనపు ఎస్‌పి మునిరామయ్య, తిరుపతి అదనపు ఎస్‌పిలు కులశేఖర్, రాజేంద్ర, ఏఆర్ లక్ష్మీనారాయణరెడ్డి, టిటిడి విజిఒలు బాలిరెడ్డి ,గిరిధర్, సిఐలు పి.జగన్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు. తిరుమలలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం క్రైమ్ ఐడి పార్టీలను బృందాలుగా ఏర్పాటుచేసి జేబు దొంగతనాలు,చిన్నపిల్లల కిడ్నాప్ వంటి నేరాలు జరగకుండా ముందస్తు సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకుని నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తెలుసుకుని కట్టడి చేయాలన్నారు. ఇంకా పలు భద్రతాపరమైన అంశాలపై సమీక్షించారు.

## తేలికపాటి వర్షానికే రోడ్లు గుంతలమయం



కార్వేటినగరం, ఆగస్టు 17 ప్రభాతవార్త: తేలికపాటి వర్షానికే రోడ్లు గుంతలమయం అవుతుందని జిడినెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ యుగందర్ పొన్నా అన్నారు. కార్వేటినగరం మండలం ఆర్‌కెవిబిపేట గ్రామంలో తేలికపాటి వర్షానికే రోడ్లు అద్వానంగా మారుతుందని అన్నారు. ఆర్‌కెవిబిపేట పరిధిలోని బందాలదొడ్డి మార్గం,చింతమండి,రాజులకండ్రిగ గ్రామానికి వెళ్ళె వాహనదారులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామంలోని రైతులు,మహిళలతో కలిసి రోడ్లుల్లోని గుంతల్లో వరినాట్లు నాటడం జరిగింది. ఈ సంధర్భంగా యుగందర్ పొన్నా మాట్లాడుతూ జిడినెల్లూరు నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి దుస్థితిలో వుందన్నారు. 15రోజుల్లో అద్వానపు రోడ్లను బాగుచేయకుంటే డిప్యూటీ సిఎం నారాయణస్వామి రాజీనామా చేయాలని ఈ సంధర్భంగా యుగందర్ పొన్నా డిమాండు చేశారు. నిత్యం రాకపోకలు సాగించే గ్రామాల్లో రోడ్లు నిర్మాణం చేపట్టక పోతే జనసేనపార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకోలు చేపట్టతామన్నారు. ఈ సంధర్భంగా జనసేనపార్టీ నాయకులు బురదనీటిలో కూర్చొని వినూత్న నిరసన తెలిపారు. అలాగే కెయంపురం గ్రామంలో వర్షానికి నిలిచిన నీళ్ళలో మోకాళ్ళపై నిరసన కార్యక్రమం తెలిపారు. ఎంపిడిఓ క్షేత్రస్థాయి పర్యటన చేయాలన్నారు. డెంగ్యూ జ్వరంతో 18నెలల పాప నిన్నటిరోజున మరణించిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శోభన్‌బాబు, నియోజకవర్గ యువజన ప్రధాన కార్యదర్శి వెంకటేష్,జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ,మండల ఉపాధ్యక్షులు సురేష్‌రెడ్డి, జనసైనికులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## వరినాట్లు వేసిన మహిళలు

### అనధికారిక విద్యుత్ కోతలతో

## ప్రజల తిప్పలు




శ్రీకాళహస్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అనధికారికి విద్యుత్ కోత లతో ప్రజలు,వ్యాపారస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. విద్యుత్‌శాఖ అధికారిక విద్యుత్ కోత లేదంటూనే అనధికారికంగా కోతలు విధిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి రోజూ విద్యుత్ కోతను నాలుగు మాడావీధుల్లో మూడు నాలుగుసార్లు విధిస్తున్నారు. దాంతో వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా విద్యుత్ శాఖ బిల్లులతో దడపుడుతుంది. అయితే కోతలతో జనం ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు.విద్యుత్ అధికారులు ఏమో ఒక్కొక్క సారి 'ట్రాన్స్‌కో నిర్వాహకులు ఆఫ్ చేస్తున్నారు. మేము ఏమి చేయలేమంటూ చేతులు దులుపుకుంటున్నారు'. దాంతో ఈ ప్రాంతాలకు వచ్చే భక్తులు దిగే అతిధి గృహాల్లో జనరేటర్లు లేదు.దాంతో గదుల్లో ఉక్కపోతను భరించలేకున్నారు.గత పాలనలో శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం కాబట్టి రెండవ శనివారాలు నిర్వహణలో బాగంగా కూడా నాలుగు మాడావీధులను మినహాయించారు. ఇందుకు అప్పటి పాలకులు లోబావిలో ప్రత్యేక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించారు.ఈ ట్రాన్స్‌ఫార్మర్ కేవలం శ్రీకాళహస్తీశ్వరాలయం నాలుగు మాడావీదులకు సంబంధించినది. అయితే ప్రస్తుతం కొత్త పాలకులు, కొత్త అధికారుల హయాంలో గత వెసులుబాట్లును అమలు చేయటం లేదు. పుణ్యక్షేత్రం కాబట్టి శనివారం భక్తుల తాకిడి అత్యధికంగా ఉంటుంది.ఈ సమయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో కోత అంటే వ్యాపారుల తిప్పలు వర్ణనాతీతం. తినుబండారాలు తయారు చేసుకోనుటకు ఇబ్బందిగా మారింది. ఇక సాధారణ రోజుల్లో మూడు నాలుగు సార్లు విద్యుత్ సరఫరాలో అంతరాం కల్గుతుంది. ఒక సారి అంతరాయం కల్గితే కనీసం అర్థగంట కోత విధిస్తున్నారు. దాంతో వ్యాపారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అధికారులు మారితో విధానాలు మారిపోతాయా? పుణ్యక్షేత్రంకు ఉన్న ఉనికి మారిపోతుందా? అనే విమర్శలు చోటు చేసుకున్నాయి. నాలుగు మాడావీధుల్లోనే హోటళ్ళు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు,వెలసి ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు గత పరిపాలనా పుస్తకాన్ని పరిశీలించి చర్యలు తీసుకొని ప్రభుత్వంపై వ్యతిరేకతను తగ్గించాలని కోరుతున్నారు.

### కలెక్టరేట్ కార్యాలయం

## వివాదాలకు నిలయంగా మారింది

**టిడిపి మహిళా నేత పులివర్తి సుధారెడ్డి**



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 17, ప్రభాతవార్త ప్రజా సమస్యల పరిష్కారానికి నిలయం కలెక్టరేట్ కార్యాలయం వివాదాలకు నిలయంగా మారడం సోచనీయమని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్ధి పులివర్తి నాని సతీమణి, టిడిపి మహిళా నేత పులివర్తి సుధారెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. గురువారం తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటరమణా రెడ్డి అధ్యక్షన ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిడిపి, వైకాపా, జనసేన, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం ఇతర పార్టీల నాయకులు హాజరైయ్యారు. అయితే కలెక్టరేట్‌లో సాంప్రదాయాలను గౌరవించాల్సిన వైకాపా నాయకులు, అందుకు విరుద్ధంగా నడుచుకోవడం పలు విమర్శలకు తావిచ్చింది. ఈ అఖిల పక్ష సమావేశానికి హాజరైన టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి, వైసిపి శ్రేణుల తీరును తప్పు పట్టారు. ఇంటింటి ఓటరు పరిశీలన కార్యక్రమానికి సంబంధించి, చర్చించాల్సిన అంశాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పక్క దారి పట్టించి, అనవసరమైన రాధ్ధాంతానికి తెరతీయడం సరికాదని హితవు పలికారు. అసలు ఎటువంటి అథరైజేషన్ లేకుండా అఖిలపక్ష సమావేశానికి హాజరై, కక్షపూరిత వాతావరణ సృష్టించడాన్ని ఆమె తప్పు పట్టారు.






## నష్టాల ఊబిలో వేరుశనగ రైతు



వేరుశనగకాయలకు ధరలు లేక కల్లోలోనే ఎండ బెట్టుకోంటున్న అన్నదాతలు

వెంకటగిరిరూరల్ ఆగష్టు 17 ప్రభాతవార్త: అన్నదాతలు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పగలు అనకా రేయి తేడా లేకుండా ఎంతగానో కష్టపడి శ్రమించి తీరా విక్రయించుకోనే వేరుశెనగకాయలకు ధరలు తగ్గి పోవడంతో అన్నదాతలు అవేదన వ్యక్తం చేస్తు కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని కన్నీటి పర్యంతం అవుతున్నారు.వెంకటగిరి,డక్కిలి,బాలాయపల్లి మండాలల్లో సమారు వేల హెక్టర్‌లల్లో రైతులు వేరుశనగ సాగు చేస్తున్నారు. కనీసం కూలీలు ఖర్చు కూడా వచ్చే పరిస్థితులు లేవని అన్నదాతలు అంటున్నారు. ముఖ్యంగా వెంకటగిరి మండలంలోని కుర్జగుంట,మన్నెగుంట, చెలికంపాడు, కలవలపూడి. చిన్నన్నపేట,జికేపల్లి యాతలూరు గ్రామలల్లో .ఆదేవిదంగా డక్కిలి మండలంలోని అల్తూరుపాడు ,తదితర ప్రాంతాలల్లో రైతులు అధికంగా వేరుశన పంట సాగు చేస్తున్నారు.ప్రస్తుతం మార్కెట్‌లో వేరుశగకాయలు నాణ్యత బట్టి 1400 నుంచి 1600 రూపాయులు వరకు పలుకుతు న్నాయని తెలిపారు. రంగుమారిన వేరుశనగ కాయలను మాత్రం దళారులు 900 రూపాయులు నుంచి 1100 రూపాయులు మాత్రం కోనుగోలు చేస్తున్నరని అంటున్నారు.అది కాకుండా దిగుబడి కూడా చాలా తగ్గిందని రైతులు అంటున్నారు.గత సంవత్సరం కంటే ఈ ఎడాది వేరశనగ ధరలు కూడా భారీ తగ్గడంతో రైతులు అందోళన చెందుతున్నారు.అధిక వడ్డీలకు అప్పులే చేసి కనీసం పెట్టుబడులు కూడా రాకుంటే రైతులు అప్పుల ఊబిలో కురుకోనే పోయే ఆవకాశం ఉందని రైతులు అంటున్నారు.వ్యవసాయ సాగు చేసే రైతులకు శ్రమ తప్ప అధాయాలు ఎమి రావడం లేదని అన్నదాతాలు అక్రోశిస్తున్నారు.ప్రభుత్వం వేరుశనగ సాగు చేసే రైతులను అదుకోవాలని కోరతున్నారు.

# పుంగనూరు అల్లర్లు చంద్రబాబు కుట్ర

-చైర్మన్ అలీంబాషా

పుంగనూరు,ఆగస్టు 17 ప్రభాతవార్త :
ఈనెల 4న పుంగనూరులో చంద్రబాబు రోడ్‌షో సందర్భంగా జరిగిన అల్లర్లకుట్రలో ప్రధాన పాత్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,తెదేపా ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిలదేనని మున్సిపల్ చైర్మన్ అలీంబాషా ఆరోపించారు. గురువారం ఈమేరకు పట్టణంలో వైకాపా పార్టీనాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. చంద్రబాబు రోడ్‌షో సందర్భంగా అల్లర్లు,కాల్పులకు తెరలేపాలని, తద్వారా సానుభూతి పొందాలనే ప్లాన్ ముందస్తుగా వేసుకుని




తీవ్రభయాందోళనలు సృష్టించి తెలుగుదేశం పార్టీ వర్గాలు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి ఎదురుదాడి చేయలేక పోవడంతో పాటూ పుంగనూరు నుంచి సానుభూతి సాధించేందుకు పోలీసులు కాల్పులకు జరిపేలా రెచ్చగొట్టాలని సార్ ప్రణాళిక సిద్ధం చేశారని,దీనిని చల్లాబాబు పాటించారన్నారు. ఇటువంటి దారుణ సంఘటనలకు పాల్పడుతున్న తెలుగుదేశం నాయకులను బహిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఆర్టీసీ షాపులకోసం దరఖాస్తులు

కుప్పంరూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త
కుప్పం ఆర్టీసీ డిపో పరిధిలోని కుప్పం, వి.కోట, రామకుప్పంలలోని 42 షాపులకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ పెంచలయ్య తెలిపారు. కుప్పంలో 27,వి.కోట 5, గుడుపల్లె 5, రామకుప్పంలో 5 షాపులకు గాను ఆసక్తిగల వారు ఈనెల 25వతేది లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 26వతేది టెండర్లను ఖరారు చేయడం జరుగుతుందన్నారు.

## రాత్రయితే కరెంట్ కట్

- ఉక్కబోతతో ఉక్కిరి బిక్కిరి

**పాలసముద్రం, ఆగస్టు 17 ప్రభాతవార్త:** కరెంటు కోతలకు ఇదేమి వేసవికాలం కాదు. ఈ వేసవిలో కరెంటు కోతలకు ఫుల్‌స్టాప్ పెట్టిన ప్రభుత్వం వర్షాకాలంలో రాత్రి వేళల్లో కరెంటు కోతలు విధిస్తుండటంతో ప్రజలు ఉక్కబోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇది వర్షాకాలమైనప్పటికీ వర్షం జాడ కన్పించకపోవడం, మరోవైపు ఎండలు తీవ్రంగా వుండటంతో ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ట్రాన్స్‌కో అధికారులు రాత్రి సమయాల్లో పల్లె ప్రాంతాల్లో రెండు నుండి నాలుగు గంటల పాలు అనధికారికంగా కరెంట్ నిలుపుదల చేస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కరెంటు లేక ఇంట్లో వుండలేక, చీకటిలో బయటికి వెళ్ళలేక నిద్రాహారాలు మాని జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రాన్స్‌కో అధికారి ప్రతి రోజు రాత్రి సమయాల్లో రెండు నుండి నాలుగు గంటల పాటు అనధికారికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల స్థాయి అధికారులను ఈ కరెంటు కోతల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తే వారి నుండి సరైన సమాచారం రావడం లేదు. మండల స్థాయిలో వుండే సబ్ స్టేషన్ల పరిధిలో ఈ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయకపోవడంతో తమ విద్యుత్ సరఫరాకు సంబంధించి తమ పరిధిలో ఏమి లేదని పై స్థాయి అధికారులే ప్రస్తుతం విద్యుత్ సరఫరా వ్యవహారాలు చూస్తున్నారని చల్లటి కబురు చెప్పి తప్పించుకొంటున్నారు. మెయిన్ సప్లై పోవడంతో అది ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి వుంటుందని ఈ మేరకు తాము సైతం ఎప్పుడు విద్యుత్ సరఫరా వస్తుందనే విషయంపై స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోతున్నామని ట్రాన్స్‌కో సిబ్బంది పేర్కొంటున్నారు.

## క్లాత్ మిత్రులకు పెండింగ్‌లో జీతాలను వెంటనే చెల్లించండి

- ఏఐటీయూసీ డిమాండ్



నగరి, ఆగస్టు 17 ప్రభాతవార్త:
జిల్లాలో పని చేసే గ్రీన్ అంబాసిడర్లు క్లాత్ మిత్ర కార్మికుల పెండింగ్ జీతాలు ఇవ్వాలని గురువారం నగరికి వచ్చిన చిత్తూరు పంచాయతీ అధికారికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ పంచాయతీ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తూ గ్రామానికి శుభ్రపరిచే దుమ్ము, ధూళిలో పని చేస్తూ ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా పని చేస్తున్నటువంటి కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించకపోవడం రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సక్రమంగా జీతాలు చెల్లించలేని పక్షంలో ఉపాధి హామీ పథకం కింద వీరిని మార్చాలని కోరారు. 15 ఫైనాన్స్ నుంచి సర్పంచ్ ద్వారా జీతాలు పెంచామని చెప్పి సంవత్సరం కావస్తున్నా ఒక్క రూపాయి జీతం చెల్లించలేదు. కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సామాజిక బాధ్యతతోనే ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం చిత్తూరు పంచాయతీ అధికారి లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జీతాలకు సంబంధించి అన్ని ఎంపీడీవో, ఈఆర్డీవోలకు విజయవాడ నుంచి కమిషనర్ 15 ఫైనాన్స్ నుంచి జీతాలు ఇవ్వాలని సర్క్యులర్ పంపించామని మరల ఫోన్ ద్వారా మాట్లాడి జీతాలు వేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్‌కి జీతాలు 4 రోజుల్లో జీతాలు వేయకపోతే నగరి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన, దీక్ష చేపట్టి తీరుతామని అన్నారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్రన్, జిల్లా ఉపాధ్యక్షులు ఏసు పాదం, దేశప్ప, సహాయ కార్యదర్శిరవి,గిరి,ఏళుమలై,నగరిమండలఅధ్యక్షకార్యదర్శులుకుమార్,రవి,కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## బాధ్యతగా బిఎల్ఓలు విధుల నిర్వహణ

- కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:
బిఎల్ఓలు బాధ్యతగా విధులు నిర్వర్తించి ఎన్నికల విధులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా రీ-వెరిఫికేషన్ కార్యక్రమంపై గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ డాక్టర్ జె.అరుణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమీషనర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా రీ-వెరిఫికేషన్ కార్యక్రమంను క్షేత్ర స్థాయిలో పక్కాగా చేపట్టాలన్నారు. బిఎల్ఓలు నేరుగా ప్రతి ఇంటికి వెళ్ళి ఓటర్ల జాబితా రీ-వెరిఫికేషన్ చేయాలన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి ప్రతి ఒక్కరు బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. అలాగే పెండింగ్ వెరిఫికేషన్ ఓటర్ల జాబితాను త్వరితంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి ప్రకాశ్, అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, ఎన్.ఓ సౌందర్‌రాజన్, ఎసిపి రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన రేణుకారెడ్డి

పెద్దపంజాణి,ఆగస్టు 17,ప్రభాతవార్త:



ఇటీవల పుంగనూరు ఘటన కేసులో అరెస్టు కాబడిన వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి అమరనాథరెడ్డి సతీమణి రేణుకారెడ్డి గురువారం పరామర్శించారు. పెద్దపంజాణి మండలంలోని బట్టందొడ్డి పంచాయితీ కొత్తూరుకు చెందిన టిడిపి సానుభూతి పరులు నిరంజన్‌రెడ్డి, పెద్దారికుంట పంచాయితీకి చెందిన మోహన్, బాలాజీ, హరిక్రిష్ణ,త్రిమూర్తి, శ్రీనాద్,నాగేంద్రలపై అక్రమ కేసులు బనాయించి కడప జైలుకు తీసుకెళ్లడం జరిగిందని ఆమె ఆరోపించారు. ఈ మేరకు వారి కుటుంబాలను పరామర్శించిన ఆమె అరెస్టు కాబడిన వారు త్వరలోనే కేసుల నుంచి విడుదలై బయటకు వస్తారని అంతవరకు సంయవనం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్,ప్రధానకార్యదర్శి చలపతి, నాయకులుసుధాకర్‌రెడ్డి,మురహర్‌రెడ్డి,నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలి

-జిల్లా సైన్స్ అధికారి రమణ




పలమనేరు,ఆగస్టు 17,ప్రభాతవార్త:
ఆవిష్కరణల దిశగా అడుగులు సాగించాలంటు జిల్లా సైన్స్ అధికారి ఆర్‌వి రమణ పేర్కొన్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గైడ్ టీచర్ల శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మదిలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడం, సమాజానికి మేలుచేసే ఆలోచనలకు రూపమివ్వడం,ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం,ఆవిష్కరణలవైపు విద్యార్థులను తీసుకువెళ్లటంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ,నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. ఈ మేరకు పలమనేరు, గంగవరం, పుంగనూరు, పెద్దపంజాణి,చౌడేపల్లె,బంగారుపాళ్యం మండలాలలోని 160మంది గైడ్ ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిణి లీలరాణి,బాలసుందరం, మోహన్‌రామ్,శ్రీనాథ్, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఘనంగా ఎపియుడబ్ల్యుజె ఆవిర్భావ దినోత్సవం



చిత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:
జిల్లా కేంద్రం చిత్తూరులో గురువారం ఎపిడబ్ల్యుయుజె 67వ ఆవిర్భావ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఆర్డీఓ డాక్టర్ రేణుకను కలిసి జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను కట్టడి చేయాలని, జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయడానికి కమిటీ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం గంగనపల్లి సమీపంలోని నిరాశ్రయుల కేంద్రంలో ఎపిడబ్ల్యుయుజె ఆవిర్భావ దినోత్సవంను పురస్కరించుకొని జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణలు పట్టణ నిరాశ్రయుల కేంద్రంలోని వృద్ధులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు సామాన్యుల గొంతును వినిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లోకనాథం, అశోక్‌కుమార్‌లు, ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు పవన్‌కుమార్, శివ, మురళి, చంద్ర, అయ్యప్పలు, సీనియర్ జర్నలిస్టులు కాళేశ్వర్‌రెడ్డి, రమేష్‌బాబు, వీరరాఘవులు, బాలసుందరం, చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ వైద్యశాలగా మారిన స్విమ్స్

తెలుగుదేశం నాయకులు ఆరోపణ



చిత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:
రాయలసీమకు తలమానికంగా వున్న శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) వైద్యశాల నానాటికి వ్యాపార సంస్థలా తయారైందని తెలుగుదేశం నాయకులు ఆరోపించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం దేశం నాయకులు మోహన్‌రాజ్, వెంకటేష్‌యాదవ్, సప్తగిరి ప్రసాద్‌లు విలేకరులతో మాట్లాడుతూ నిరుపేదలకు వైద్య సేవలు అందించడానికి దివంగత సిఎం ఎన్టీఆర్ స్విమ్స్ ఏర్పాటు చేశారని, స్విమ్స్‌ను టిటిడి స్వాధీనం చేసుకొన్న అనంతరం ఇక్కడ వ్యాపార ధృక్పధం మరింత పెరిగిపోయిందని వారు ఆరోపించారు. అడ్మిషన్ల నుండి డిశ్చార్చి వరకు నిరుపేదలను డబ్బులు కట్టమని వైద్యులు వేధిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ అడ్మిషన్లు లభించాలంటే ఎంపీలు, ఎమ్మెల్యేల పైరవీలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. స్విమ్స్‌లో కొత్తగా కొనుగోలు చేసిన పరికరాలు ఏమిటి! రోగులకు ఉచితంగా ఎలాంటి సేవలు అందిస్తున్నారనే విషయంపై శ్వేతపత్రం విడుదల చేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దేశం నాయకులు మేషక్, ధరణిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కట్టమంచి చెరువులో చేపల మృతిపై విచారణ



మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశం

చిత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త:
చిత్తూరు కట్టమంచి చెరువులో చేపల మృతి చెందిన సంఘటనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. కట్టమంచి చెరువులో చేపలు మృతి చెందాయని తెలిసిన వెంటనే గురువారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ కట్టమంచి చెరువు పరిసరాల్లోకి చేరుకొన్నారు. చెరువులో మృతి చెందిన చేపలను త్వరగా తొలగించాలని, చెరువు మొత్తం బ్లీచింగ్ చేయాలని కమీషనర్ అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చేపల మృతి చెందిన విషయంను వివరించారు. అలాగే చెరువులో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో కమీషనర్ చర్చించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు చిన్నయ్య, నరసింహ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి - యుటిఎఫ్



కుప్పం, ఆగస్టు 17 ప్రభాతవార్త
ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యలు పరిష్కరించాలని కుప్పం ఎస్టీఓ మహబూబ్ బాషాను యుటిఎఫ్ నేతలు కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శి గాలి సురేష్, మండల బాధ్యుడు తులసినాథ్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వ్యర్ధాలతో అనర్ధాలు

- ఖాళీ కొబ్బరిబోండాలతో ముప్పు



సూళ్లూరుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త
సూళ్లూరుపేట పట్టణంలో ఎక్కడపడితే అక్కడ తాగి పడేసిన ఖాళీ కొబ్బరిబోండాలు, వ్యర్థాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఈ కొబ్బరి బోండాల్లో నీరు చేరుకొని ఇందులో దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ప్రజలు నివాసం ఉండే ప్రాంతాల్లో లెక్కకు మించిన ఈ కొబ్బరిబోండాల వ్యర్థాలను గుట్టలు గుట్టలుగా పడేస్తున్నారు. వర్షాకాలంలో విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇప్పటికే కొంతమందికి జ్వరాలు సోకి ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. గతంలో కొంతమంది వైద్య నిపుణులు అందించిన సమాచారం మేరకు ఈ వ్యర్థ కొబ్బరి బోండాలలో డెంగ్యూను వ్యాపింపచేసే దోమలు వృద్ధి చెందుతాయని చెప్పిఉన్నారు. ప్రస్తుతం దీన్ని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు ప్రజలు నివసించే ప్రాంతాలకు దగ్గరగా ఈ కొబ్బరి బోండాల వ్యర్థాలను తీసేసే చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కొబ్బరి బోండాలు విక్రయించే వారు వీటిని ఎండిన తర్వాత వంటచెరుకుగా వాడుకునేందుకు ఉపయోగిస్తున్నారు. దీంతో వీటిని గుట్టలు గుట్టలుగా పోసి ఎండబెట్టే చర్యలు చేపడుతున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో, షార్ వై జంక్షన్, షార్ బస్టాండ్, ఇతర జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఈ కొబ్బరి బోండాల గుట్టలు కనిపిస్తున్నాయి. కమిషనర్ కాస్త స్పందించి చర్యలు చేపడితే ప్రజలను విషజ్వరాల బారి నుంచి కాపాడిన వారవుతారు.

## 19న స్థానిక సంస్థల ఎన్నికలు

కోట, ఆగస్టు 17 ప్రభాతవార్త
కోట మండలం కేశవరం పంచాయతీలోని 5వ వార్డుకు ఉప ఎన్నిక ఈ నెల 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పంచాయతీ వార్డులో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మారెళ్ల భవాని తెలిపారు. గురువారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి లెక్కింపు చేపడతారన్నారు. ఆ వార్డుకు ఒక వర్గం పుల్లమ్మ పోటీ చేస్తుండగా, మరో వర్గం రేవతి బరిలో ఉన్నారు. ఎన్నిక జరిగే పంచాయతీలో ప్రభుత్వం సెలవు ప్రకటించినట్లు తెలిపారు. శుక్ర, శనివారాల్లో ఆ పంచాయతీలో పాఠశాలలకు సెలవు దినంగా ప్రకటించినట్లు తెలిపారు.

## నావిల్ విద్యార్థులకు అభినందనలు

కోట, ఆగస్టు 17 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న ఎన్‌సిసి నావిల్ క్యాడెట్ కెప్టెన్ లౌక్య, నావిల్ యూనిట్ క్యాడర్ ఆర్.శ్రీహరిలు ఈ నెల 15న విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఆమేరకుఆవిద్యార్థులను గురువారం కళాశాలలోవిజయకుమార్‌రెడ్డితో పాటు ఎన్‌సిసి నావిల్ వింగ్ కేర్ టేకర్ మల్లికార్జునరెడ్డి అభినందించారు.

## నాయుడుపేటలో మెగా ఉచిత వైద్యశిబిరం

నాయుడుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త



నాయుడుపేట పట్టణంలోని ఎఎల్‌సిఎం క్రీడా మైదానంలో మాజీమంత్రి పరసా వెంకటరత్నయ్య సతీమణి పరసా కస్తూరి రత్నం జ్ఞాపకార్థం గురువారం మెగా ఉచిత వైద్యశిబిరం, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. మెగా ఉచిత వైద్యశిబిరం, రక్తదాన శిబిరంలో మాజీమంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొని పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. ఈ ఉచిత మెగా వైద్యశిబిరంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల నుంచి ప్రజలు భారీగా తరలి రావడంతో వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు పరసా కస్తూరి రత్నం అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల నాయకులు, పరసా రత్నం అభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పరసా కస్తూరి రత్నం చిత్రపటానికి నివాళి అర్పించారు.

## తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి



- మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక

నాయుడుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త
నాయుడుపేట పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక అన్నారు. గురువారం నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 7, 8 వార్డుల ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేవిధంగా ఏర్పాటు చేసిన తాగునీటి మోటారును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే మున్సిపాలిటీ పరిధిలోని 7, 8 వార్డుల ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించే విధంగా రెండు మోటార్లను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కటకం జయరామయ్య, గంధవల్లి సిద్ధయ్య, కాంట్రాక్టర్ చంద్రారెడ్డి, మున్సిపల్ వాటర్ వర్క్స్ సిబ్బంది ఉన్నారు.

## అడక్కుండానే వరాలు ఇచ్చే దేవుడు జగన్మోహన్‌రెడ్డి

- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి, ఆగస్టు 17, ప్రభాతవార్త:
అడక్కుండానే వరాలిచ్చే దేవుడు సీఎం జగన్మోహన్‌రెడ్డి అని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 20వ వార్డులో కౌన్సిలర్ మల్లీశ్వరితో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడునైనా మనం వరాల కోరుకోవాలని, అయితే సీఎం అడక్కుండానే వరాల జల్లు కురిపిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగులందరికీ చేసినట్లు తెలిపారు. స్థానికంగా సిమెంట్ రోడ్లు వేయించాలని, డ్రైనేజీలు నిర్మించాలని ఇంకా పలు సమస్యలను స్థానికులు రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, కౌన్సిలర్లు కళ్యాణి, వహీదా, మల్లీశ్వరి, గోపాలకృష్ణ, శ్రీనివాసులు, నాయకులు సతీష్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టిగా పని చేస్తే 175 నియోజకవర్గాల్లో విజయం తథ్యం

- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి, ఆగస్టు 17, ప్రభాతవార్త:
అందరూ కలిసికట్టుగా పని చేసి వైసీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్‌జేఆర్ భవనంలో జేసీఎస్ మండల కన్వీనర్లు, ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభేదాలను పక్కన పెట్టి ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. టీడీపీని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. 2024 ఎన్నికల్లో అందరూ సమిష్టిగా పని చేస్తే 175 నియోజకవర్గాల్లో వైసీపీ అఖండ మెజారిటీ సాధిస్తుందని చెప్పారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి మరల సీఎంగా చేసుకోవాలని తెలిపారు. అంతర్గత విభేదాలను అందరూ విడనాడాలని సూచించారు. ఆయన వెంటపట్టణకన్వీనర్‌ఢిల్లీబాబు, నాయకులు హరికృష్ణ, సదాశివరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పొలంబడి ద్వారా రైతులకు అధిక దిగుబడులు

- జిల్లా రైతు వనరుల కేంద్రం డీడీఏ రత్నప్రసాద్



వెంకటగిరి, ఆగస్టు 17, ప్రభాతవార్త:
పొలంబడి ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా రైతు వనరుల కేంద్రం డీడీఏ రత్నప్రసాద్ తెలిపారు. అమ్మపాళెం గ్రామంలోని వరి పంటలను ఏడీఏ నాగార్జునసాగర్, ఏవో సుజాతలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంట సాగులో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. వరిపంటలో ఆకు ముడత తెగులు తదితర వాటిపై ఏడీఏ నాగార్జునసాగర్ రైతులకు సూచించారు. రైతులకు ఇంకా పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం



- సీఐటీయు జిల్లా నేత చెంగయ్య

వెంకటగిరి, ఆగస్టు 17, ప్రభాతవార్త:
మున్సిపల్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య తెలిపారు. గురువారం ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీ బయలుదేరి కాశిపేట కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం కాశీపేట కూడలిలో మానవహారం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిని చేస్తున్నటువంటి మున్సిపల్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలని కోరారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగన్నరేళ్ళు అయినా మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన హామీని మరిచారన్నారు. ఇప్పటికైనా స్పందించి పర్మినెంట్ చేయాలన్నారు. కరోనా సమయంలో మునిసిపల్ కార్మికులు ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవ చేశారని తెలిపారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాలలో బైక్ ర్యాలీ కొనసాగుతుందన్నారు. అప్పటికి ప్రభుత్వం దిగి రాకపోతే 24వ తేది ఛలో విజయవాడ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్, అధ్యక్షులు వెంకటయ్య, కార్యదర్శి ప్రసాద్, ఎస్.మోహన్, పులి వెంకటయ్య, సుధాకర్, రవి, చెంచుకృష్ణ, ఆర్.మణి, పెంచలయ్య, రమణమ్మ, సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దూదేకుల నూర్‌భాషాలకు షాదీ తోఫా సమాన వర్తింపు హర్షణీయం



-నియోజకవర్గ దూదేకుల నూర్‌భాషా సంఘం కన్వీనర్ గఫూర్

వెదురుకుప్పం,ఆగస్టు 17 ప్రభాతవార్త:
వైఎస్ఆర్ షాదీ తోఫా పథకం దూదేకుల నూర్‌భాషాలకు సమానంగా వర్తింపచేసినట్లు ప్రకటన చేసిన రాష్ట్ర ప్రభుత్వం పట్ల గంగాధరనెల్లూరు నియోజకవర్గం దూదేకుల నూర్‌భాషా సంఘం కన్వీనర్ గఫూర్ హర్షం వ్యక్తంచేశారు. గురువారం మండల కేంద్రమైన వెదురుకుప్పంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం దూదేకుల నూర్‌భాషాలకు షాదీ తోఫా పథకం కింద 50 వేల రూ॥లు అందచేసేదన్నారు. అయితే వివిధ సంఘాల విజ్ఞప్తి మేరకు ప్రస్తుత వైసిపి ప్రభుత్వం,సిఎం జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి లక్ష రూ॥లు వర్తించేలా ప్రకటించడం అభినందనీయమన్నారు. షాదీ తోఫా ప్రకటన తేదీ నుండి పథకం మొత్తం నగదు లబ్ధిదారులకు చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. షాదీ తోఫా సమాన వర్తింపుకు కృషి చేసిన సిఎం జగన్,డిప్యూటీ సిఎం నారాయణస్వామికి ముస్లిం సోదరుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గఫూర్ తెలిపారు.

## బాధితులను పరామర్శించిన సర్పంచ్



పుత్తూరురూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:
రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రామకృష్ణాపురం గ్రామ పంచాయతీలోని సదాశివ ఎస్టీ కాలనీలో జి.శివయ్య, జి.సుబ్రహ్మణ్యం, టి.లింగయ్య, టి.ధనమ్మ, టి.పద్మలకు చెందిన పూరి గుడిసెలు కూలిపోవడం జరిగింది. గురువారం రామకృష్ణాపురం గ్రామ సర్పంచ్ విరిత దేవేందర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ పద్మలు బాధితులను కలసి పరామర్శించి మంత్రి రోజాకి తెలియజేసి ప్రభుత్వం నుంచి అందవలసిన సహాయ సహకారాలు అందజేస్తామని తెలియజేశారు.

## స్మార్ట్ స్కిల్స్ శిక్షణా వర్క్ షాప్

తిరుపతి (విద్య), ఆగస్టు 17, ప్రభాతవార్త
మహిళా విశ్వవిద్యాలయం ఇంటర్నేషనల్ రిలేషన్స్ సెంటర్, ఐసిటి ఫ్రాంటియర్, వైఫై సవిష్కార, ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ సెంటర్ ప్రధాన సభ్యులైన ఆచార్య దుర్గాభవాని, ఆచార్య విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏషియా పసిఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ ఐసిటి ఫర్ డెవలప్మెంట్, బాంగ్లాదేశ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఐసిటి డెవలప్మెంట్ వారు సంయుక్తంగా ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సావేరి అతిథి గృహంలోని సెమినార్ హాల్లో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. భారతి, ఏషియా పసిఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ ఐసిటీ ఫర్ డెవలప్మెంట్ డైరెక్టర్ డాక్టర్ కియాంగ్ కో, నేషనల్ కన్సల్టెంట్ ఆన్ ఐసిటి ఫర్ ఐసిటి ఫర్ డెవలప్మెంట్ డైరెక్టర్ డాక్టర్ కియాంగో కో, నేషనల్ కన్సల్టెంట్ ఆన్ ఐసిటి ఫర్ డెవలప్మెంట్ ప్రొఫెసర్ ఉష వ్యాసులు రెడ్డి, ఏపిసిఐసిటి రిసోర్స్ పర్సన్, బిఐఐడి సిఈఓ, బాంగ్లాదేశ్ సాహిద్ ఉద్దీన్ అక్బర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 100 మందికి పైగా మహిళా పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద, సేవా సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కడిగిన ముత్యం జగనన్న - ఎమ్మెల్యే మధు

**రేణిగుంట, ఆగస్టు 17 ప్రభాతవార్త:**
కడిగిన ముత్యంలా స్వచ్ఛమైన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఆయనను విమర్శించడం తగదని ప్రతిక్షాలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హితవు పలికారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే గాజులమండ్యం పంచాయతీ పరిధిలోని ఎగువవీధి, రజక కాలనీ, నీలిసాని పేటలో సర్పంచ్ గంగారి రమేష్, వైసీపీ సీనియర్ నేత జువ్వల దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పర్యటించారు. ఎమ్మెల్యేకు ప్రజలు నీరాజనాలు పలికి మహిళలు మంగళ హారతులు ఇచ్చి గ్రామస్థులు గజమాలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారులతో చర్చించి అక్కడికక్కడే కొన్నింటిని పరిష్కరించారు. పంచాయతీ పరిధిలో



సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని, వైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. డ్రైనేజీల నిర్మాణానికి, మినరల్ వాటర్ ప్లాంటుకు శంకుస్థాపన చేశారు. వీటితో పాటు అనేక అభివృద్ధి పనులకు భూమిపూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు సిద్ధాగుంట సుధాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశారు. సుధాకర్‌రెడ్డి ఎమ్మెల్యేతో కలసి గడప గడపకు తిరిగారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలిచి తీరుతుందని జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, ఈవోపీఆర్‌డీ రత్నమ్మ, రూరల్ సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ ధర్మారెడ్డి, ఎంపీటీసీలు జువ్వల ధనంజయరెడ్డి, వెంకట రమణారెడ్డి, శశికిరణ్, సర్పంచ్‌లు మునిశేఖర్‌రెడ్డి, నాగేషం, బాబ్జిరెడ్డి, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, స్థానిక వైసీపీ నేతలు శ్రీధర్, మండల పార్టీ నేతలు, వివిధశాఖల అధికారులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి
-సీనియర్ సివిల్‌జడ్జి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త**



సెప్టెంబర్ 9వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి ఓ ప్రకటనలోతెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గం అని ఈ అవకాశం కక్షిదారులు సద్విని యోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్ చక్కని అవకాశం అన్నారు. పోలీసులు కక్షిదారులకు తెలిపి కేసులు పరిష్కరించుకునేలా చేయాలని ఆదేశించారు. బ్యాంకు, ప్రిలిటిగేషన్‌కేసులు, సివిల్, కేసులు అన్ని పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్‌జడ్జి తెలిపారు.

## వీఆర్‌ఓకు ఉత్తమ ప్రశంసాపత్రం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త**



77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో వీఆర్ఓ వై.ఎల్లయ్యబాబు ఉత్తమ సేవలందించినందుకు డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం, తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా ఎల్లయ్యబాబును పలువురు సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డికె.బాలాజీ, ఎస్పీ పరమేశ్వరరెడ్డితదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ మేళా సంస్థచే విద్యాసామగ్రి పంపిణి

**శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 17 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి మండలంముచ్చివోలు,తొండమనాడు, అక్కుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 45 మంది విద్యార్థులకు స్కూల్ మేళా స్వచ్ఛంద సంస్థచే విద్యాసామగ్రి, కొత్త యూనిఫారంలను అందించారు. గురువారం తొండమనాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య అధ్యక్షత వహించారు. సంస్థ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని 15 పాఠశాలల్లో 250మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి విద్యాసామగ్రితో పాటు నాన్‌యూనిఫారం పంపిణి చేస్తున్నట్లు వివరించారు.తొండమనాడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వంతోపాటు పేద విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణి చేయటం అభినందనీయం అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించటానికి స్వచ్ఛంద సేవా సంస్థ చొరవ ప్రసంశించదగినదన్నారు.ఈ కార్యక్రమాల్లో అక్కుర్తి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య, చిరంజీవులు, ప్రగతి ట్రస్టు కో ఆర్టినేటర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ ప్రదీప్‌కుమార్, గాంధీ, ధనశేఖర్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్ఐ తిమ్మయ్యకు పదోన్నతి!

**శ్రీకాళహస్తి,ఆగస్టు 17 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని వన్‌టౌన్ ఎస్ఐగా బాధ్యతలునిర్వహిస్తున్న ఎస్ఐ తిమ్మయ్యకు పదోన్నతి వచ్చింది.ఈ మేరకు గురువారం సమాచారం అందింది.ఆయన్ను పలువురు అభినందించారు.శ్రీకాళహస్తీశ్వరుని సేవలో చిత్తశుద్ధిగా పని చేస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించి నిర్వివాదాంసుడుగా పేరు తెచ్చుకున్నారు. ప్రోటోకాల్ డ్యూటీలు నిర్వహించటంలో ఎక్కడ ఏం జరిగినా తానున్నానంటూ హాజరై ప్రజల మన్ననలను పొందారు.2009లో తన ట్రైనింగ్‌ను పూర్తి చేసుకున్న తిమ్మయ్య మొదట తన సేవలను ట్రైనీ ఎస్ఐగా తిరుపతి అలిపిరి నుంచి ప్రారంభించారు. తరువాత తిరుమల వన్‌టౌన్, రేణిగుంట,తిరుమల, ఎంఆర్‌పల్లి, శ్రీకాళహస్తి టూటౌన్, తిరుమల 2 టౌన్,ట్రాఫిక్‌లలో పని చేసిన తిమయ్య పని చేసి ప్రతి చోటా మంచిపేరు తెచ్చుకున్నారు. సుమారు ఏడాదికి పైగా శ్రీకాళహస్తి వన్ టౌన్‌లో శివయ్య పాదాల చెంత పని చేస్తూ గురువారం సిఐగా పదోన్నతి పొందారు. ఆయన్ను పట్టణ వైకాపా యూత్‌నాయకుడు పఠాన్ ఫరీద్‌ఖాన్ సత్కరించారు. కాగా బుచ్చినాయుడుకండ్రిగ ఎస్ మంజునాథ్‌రెడ్డి కూడా సిఐగా పదోన్నతి పొందారు.

## ముడుపుల కోసం మంత్రి పెద్దిరెడ్డిని విమర్శిస్తే ఊరుకోం
-రామచంద్ర యాదవ్‌కు వైసిపి నేతల హెచ్చరిక

**తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 17 ప్రభాతవార్త:**



కేవలం ముడుపుల కోసమే పార్టీని అడ్డుపెట్టుకుని రామచంద్ర యాదవ్ జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనవసరంగా అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని వైసిపి ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నిన్నటి రోజున రామచంద్ర యాదవ్ పెద్దిరెడ్డిపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చ లేకుండా నాయకుడిగా ఎదిగి,ఎస్సీ,ఎస్టీ,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న గొప్ప మనిషి పెద్దిరెడ్డి అని కొనియాడారు.పెద్దిరెడ్డి రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక అటు ప్రతిపక్ష నేతలు,ఇటు రామచంద్ర యాదవ్ అధికార పార్టీ నేతలపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు.రాజకీయంగా ఎదగాలని పార్టీ స్థాపించిన నువ్వు ప్రజలకు ఏం న్యాయం చేస్తావో అది చెప్పుకోవాలి.అంతేగానీ నీ ఉనికి కోసం విమర్శలే అజెండాగా చేసుకుని లేనిపోని ఆరోపణలు చేస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిం చారు.సమావేశంలో నాయకులు జిలానీ బాషా,వెంకటస్వామి,హరికృష్ణ, ఆర్ముగం, వెంకటరమణ, వినాయకం పాల్గొన్నారు.

## భక్తులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత టిటిడిదే!
-శేషాచలం అడవుల్లో కూంబింగ్‌ను పెంచాలి, జనసేన జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్

**తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 17 ప్రభాతవార్త:**
తిరుమల శ్రీవారి దర్శనానికి కాలినడకన వచ్చే భక్తులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత టిటిడిదేనని జనసేన పిఏసి సభ్యుడు,ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్ స్పష్టం చేశారు.గురువారం ఆయన జనసేన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అడవిలో ఎర్రచందనం స్మగ్లర్ల అలజడి కారణంగానే అడవిలో నుండి జనారణ్యంలోకి వస్తున్నాయన్నారు.ఎర్రచందనం చెట్లను యదేచ్ఛగానరుకుతూఉండటంవల్లవన్యప్రాణులుభయాందోళనకు గురై జనసంచారంలోకి వచ్చి ఈవిధంగా చిన్నారులపై దాడులు చేస్తున్నాయని మండిపడ్డారు.తక్షణం అటవీశాఖ అధికారులు కూంబింగ్ పెంచాలని డిమాండ్ చేశారు.చేతి కర్రలతో పులుల నుండి భక్తులు తమను తాము ఎలా రక్షించుకోవాలో అధికారులు సమాధానంచెప్పాలన్నారు.పులులుజనారణ్యంలోకిరావడానికిగలకారణాలపై అధ్యయనం జరగాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చిరుతపులి చిన్నారులపై దాడి చేసి చంపడం మానవ తప్పిదమేనని ఆయన తేల్చి చెప్పారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా,భక్తుల మనసుల్లో భయాందోళనలు పోగొట్టేలా భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని టిటిడి అధికారులకు సూచించారు.

## గోవింద ధామం ప్రతినిధులతో కమిషనర్ హరిత సమీక్ష

**తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 17, ప్రభాతవార్త**



గోవింద ధామం ప్రతినిధులతో నగర పాలక సంస్థ కమిషనర్ హరిత గురువారం సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గోవిందధామంలో వసతులు పెంచాలని, గోవింద ధామంలో దహన సంస్కారాలకు వచ్చే వారికి మరిన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అలాగేపరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బాలాజీ కాలనీలోని స్మశాన వాటికలోకూడా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గ్యాస్‌తో నడిచే దహనక్రియల వాటికను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి అక్కడ కావాల్సిన దహన వాటిక, పరికరాలపై సహకారం అందించాలన్నారు.సమావేశంలోడిప్యూటీకమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్‌వెంకట్రామి రెడ్డి,డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రా రెడ్డి, గోవింద ధామం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇకపై ఆర్టీసి డిపోలోకి అన్ని బస్సులు వస్తాయి

**పుత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త :**
ఆర్టీసి పుత్తూరు డిపోతో పాటు ఇతర డిపోలకు చెందిన ఆర్టీసి బస్సు సర్వీసులన్నీ ఇకపై పుత్తూరు డిపోలోకి వచ్చి వెళతాయని డిపో మేనేజర్ ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు, తిరుపతి, కంచి, తిరుత్తణి, సత్యవేడు, నగరి, తిరుమల ప్రాంతాలకు పుత్తూరు మీదుగా వెళ్లే బస్సు సర్వీసులన్నీ పుత్తూరు డిపోలోకి వస్తాయని తెలిపారు. గతంలో ఈ సర్వీసుల్లో కొన్ని డిపోలోకి రాకుండా వెళ్లిపోయేవని, దీని వల్ల ప్రయాణీకులు అసౌకర్యానికి గురయ్యేవారన్నారు. అందువల్ల ప్రయాణీకుల కోసం కల్పించిన ఈ వెసులుబాటును వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## టీడీపీని గెలిపించండి సమస్యలు పరిష్కరిస్తాం - రిషితారెడ్డి

**రేణిగుంట, ఆగస్టు 17 ప్రభాతవార్త:**



టీడీపీని ఆదరించి చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రి చేస్తే సమస్యలను పరిష్కరిస్తామని శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి రిషితారెడ్డి హామీ ఇచ్చారు. ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెదళ్ళ చెరువు తదితర ప్రాంతాల్లో మండల, పట్టణ టీడీపీ శ్రేణులు గురువారం రిషితారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు మునిరాజానాయుడు, చంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మహబూబ్ బాషా, అడ్వకేట్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మునస్వామినాయుడు, కొరియర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి తనవంతు సాయం అందిస్తా



జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ సుమన్

**నారాయణవనం, ఆగస్టు 17 ప్రభాతవార్త :**
మండలంలోని భీమునిచెరువు యుపి పాఠశాల అభివృద్ధికి తనవంతు సాయం తప్పక అందిస్తానని జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ తెలిపారు. సుమన్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, పిల్లల భవిష్యత్తుకు సంబందించి తనవంతు సాయం తప్పక అందిస్తానన్నారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థితికి రావాలన్నారు. క్రమశిక్షణతో పిల్లలు బాగా చదువుకోవాలన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను సొంత డబ్బులతో అందించారు. అలాగే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికి భోజనం ప్లేటులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, వైస్‌ఎంపిపి శివశంకర్, సర్పంచ్ మురుగేశం, మాజీ సర్పంచ్ కోనేటి సుధాబాబు, ఎంఇఓ ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి, హెడ్‌మాస్టర్ బంగారమ్మ, పంచాయతీ కార్యదర్శి కిషోర్‌కుమార్‌రాజు, టీచర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక కష్టాలు తీరాలంటే తెలుగుదేశం రావాలి

**నగరి, ఆగస్టు 17 ప్రభాతవార్త:**



నగరి రూరల్ మండలం తడుకుపేట పంచాయతీలో టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు తెలుగు మహిళల ఆధ్వర్యంలో మహాశక్తి చైతన్య ప్రచార కార్యక్రమం జరిగింది. పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు. ఇంటింటికి మహాశక్తి కరపత్రాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1500లు ఏడాదికి రూ.18 వేలు, 5 ఏళ్ళకు రూ.90 వేలు అందుతాయని, తల్లికి వందనం కింద ప్రతి తల్లికి ఏడాదికి రూ.15 వేలు, దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. అలాగే మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేయవచ్చునని మహిళలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి మీర, పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, నియోజకవర్గ అధ్యక్షురాలు సంపూర్ణమ్మ, ప్రధాన కార్యదర్శి నాగరత్నమ్మ, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ రజని, అధికార ప్రతినిధి శ్రీమతి, నగరి రూరల్ మండల అధ్యక్షురాలు గాలి లక్ష్మి, విజయపురం తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణ భూషణమ్మ, పుత్తూరు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మోహన, సంధ్య, సుభాషిణి, స్వప్న, మండల ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, టీఎన్‌టీయూసీ రాష్ట్ర సెక్రటరీ బాలాజీ, పరంధామనాయుడు, సురేష్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లత్తూరులో పైప్‌లైన్‌లో బురద నీరు

**విజయపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త :**



మండలంలోని ఇల్లత్తూరులో పైప్‌లైన్లో వర్షపు నీరు కలిసిపోవడంతో బురద నీరు సరఫరా అవుతోందని గ్రామస్తులు తెలిపారు. కళస్థలి నదిలో వంకలో పారే నీరు కలవడం వల్ల రెండు రోజుల పాటు మంచినీరు రంగు మారి బురదమయంగా వస్తోందని దాంతో తాగడానికి ఇబ్బందిగా వుందని గ్రామస్తులు వాపోయారు. అధికారులు స్పందించి గ్రామంలో తాగేందుకు రెండు రోజుల పాటు ట్యాంకర్ ద్వారా మంచినీరు సరఫరా చేయాలని కోరారు.

## 40మంది నిరుద్యోగులకు ఉపాధి లభ్యం



**కార్వేటినగరం,ఆగస్టు 17 ప్రభాతవార్త:**
కార్వేటినగరం ప్రభుత్వపారిశ్రామిక విద్యాసంస్థలో 40మంది నిరుద్యోగులకు ఉపాధి లభించినట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ ఇ.మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఐటిఐలో 62మంది యువతీయువకులకు మినీజాబ్ మేళా నిర్వహించడం జరిగింది. ఈ జాబ్ మేళాలో 40మంది నిరుద్యోగులకు ఉద్యోగం లభించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు సి.చైతన్య,బి.పవన్‌కుమార్,టి.అబ్దుల్,రుద్రయ్య,విజయ్,సిబ్బంది పాల్గొన్నారు.

## 21న జీ తెలుగులో
కొత్త ధారావాహిక 'జగధాత్రి' ప్రారంభం

**తిరుపతి,ఆగస్టు 17 ప్రభాతవార్త:**
ఎప్పటికప్పుడు సరికొత్త కథనాలతో ,భిన్నమైన సీరియల్స్‌తో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు మరో కొత్త సీరియల్ జగధాత్రి ని ఈ నెల 21న ప్రేక్షకలోకంలోకి తీసుకురానుంది. ఈ ధారావాహికలో దీప్తి మన్నె, నూతన నటుడు దర్శి చంద్రప్ప ప్రధాన పాత్రలోలో నటించారు.మహిళా సీక్రెట్ ఏజెంట్ చుట్టూ ముడిపడిన పరిస్థితులు, కుంటుంబంలో పెద్ద కుమార్తెగా ,ఒక మహిళ తన గతం, తన కుటుంబం,తన వృతిని సమన్వయం చేసుకుంటూ జీవిస్తూనే అక్రమాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించే అద్భుతమైన కథతో ప్రతిరోజు రాత్రి 7:30 గంటలకు ప్రసారమవుతుందని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. జగధాత్రి.రాధమ్మ కూతురుగా జీ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైప దీప్తి మన్నె, దర్శ చంద్రప్పతో పాటు ఈ సీరియల్‌ల్లో ప్రీతి శ్రీనివాస్ కీలక పాత్రలో కనపడనున్నారు.

## ఏపిఎన్జీవో రాష్ట్ర మహాసభలకు ఎంఎల్‌ఏకు ఆహ్వానం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త**



ఈనెల 21,22వ తేదీన విజయవాడలోని ఇందిరామై దానంలో జరిగే ఎన్జీవో రాష్ట్ర మహసభలకు హాజరు కావాల్సిందిగా స్థానిక శాసనసభ్యులు బియ్యపుమధు సూధన్‌రెడ్డికి ఏపి ఎన్జీవో నాయకులు గురువారం ఆహ్వానపత్రికను అందించి తప్పక హాజరు కావాల్సిం దిగా కోరారు. ముందుగా శాసనసభ్యున్ని శ్రీకాళహస్తీశ్వరుని కండువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించారు. ఈసందర్భంగా ఏపి ఎన్జీవో శ్రీకాళహస్తి తాలూకా యూనిట్ అధ్యక్షులు సి.చెంచురత్నం యాదవ్ మాట్లాడుతూ విజయవాడలో జరిగే రాష్ట్ర మహాసభలకు తప్పక హాజరు కావాలని ఎంఎల్‌ఏను కోరారు. ఈనెల 20వ తేదీ ఆదివారం సాయంత్రం 5ః30నిమిషాలకు ఎన్జీవో నాయకులు అందరు శ్రీకాళహస్తి మార్కెట్‌యార్డు నుంచి బయలుదేరుతాయన్నారు. అనంతరం ఎంఎల్‌ఏ హాజరై మహాసభలకు వెళ్ళే బస్సులను పచ్చజెండా ఊపి సాగనంపాలని కోరారు. మహాసభలకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకులు, కర్షకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపి ఎన్జీవో శ్రీకాళహస్తి తాలూకా యూనిట్ అధ్యక్షులు మరియు ఏపి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.చెంచురత్నంయాదవ్, కార్యదర్శి నాగరాజు, అసోసియేట్ సభ్యులు పివి.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు జనార్ధన్, భాస్కర్, చిరంజీవి, హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వార్డు సభ్యురాలి గెలుపునకు టిడిపి ప్రచారం

**పుత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త :**
రూరల్ మండలం వేపగ్గుంట గ్రామ పంచాయతీ మూడో వార్డు సభ్యురాలిగా తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి ఎ.భారతి గెలుపునకు గురువారం టిడిపి నాయకులు ప్రచారం నిర్వహించారు. వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి టిడిపి అభ్యర్థికి ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో తడుకు సర్పంచ్ బొబ్బిలి వెంకటేష్ యాదవ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎ.బాలాజీ, మాజీ అధ్యక్షుడు కరుణ యాదవ్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శేఖర్‌నాయుడు, ఐటిడిపి సమన్వయకర్త గాలి గోపినాథ్, ఇంకా నాయకులు కోటయ్య, బాబునాయుడు, లోకేష్, మోహన్, మునికృష్ణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వర్సిటీకి ఇండియా టూడే 35వ ర్యాంకు

**తిరుపతి (విద్య), ఆగస్టు 17, ప్రభాతవార్త**



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియా టుడే ర్యాంకుల విధానంలో జాతీయ 35వ ర్యాంకును ప్రభుత్వ వర్సిటీల కెటగిరీలో సాధించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ మొదటి ప్రయత్నంలోనే ఉన్నత ర్యాంకుకు కృషి చేసిన ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపుర సుందరి, టీం సభ్యులను అభినందించారు. ప్రొఫెసర్ రజిని ఎటువంటి అనుబంధ కళాశాలలో లేకున్నా కూడా, టీచింగ్, నాన్ టీచింగ్ కృషి వలన విశ్వవిద్యాలయం 35వ ర్యాంకు అందుకోవడం ఆనందదాయకమని అన్నారు. ప్రొఫెసర్ వెంకటకృష్ణ, ప్రొఫెసర్‌విద్యావతి, ప్రొఫెసర్ సీత, ఇతర ఐక్యూఏసి సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్ఐ వంశీధర్‌కు ప్రశంసలతో పదోన్నతి

**చంద్రగిరి, ఆగస్టు 17 ప్రభాతవార్త:**



చంద్రగిరి ఎస్ఐ వంశీధర్‌కు కలిసి వచ్చిన అదృష్టం ప్రభుత్వ ప్రశంసలతో కూడిన పదోన్నతి లభించడం పట్ల సర్వత్రా అభినందనలు లభిస్తున్నాయి. విశాఖపట్టణంకు చెందిన వంశీధర్ స్వతహాగా జర్నలిస్ట్ అయినప్పటికీ పోలీసు విధుల పట్ల ఆయనకు గల మక్కువతో 2009 నాన్ లోకల్ కోటాతో ఎస్ఐగా ఎంపికయ్యారు. 2009 నుండి 2022 వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విధులు నిర్వహించిన ఆయన ఆపై చంద్రగిరికి బదిలీపై చంద్రగిరి వచ్చారు. ఏడాది కాలం ఇక్కడ పనిచేస్తుండగా ప్రభుత్వం ఆయన సేవలను గుర్తిస్తూ ఉత్తమ సేవకుడుగా ప్రశంసాపత్రంతో అభినందనలు తెలియజేసింది. అయితే ఆయనకు అదృష్టం మరింత చేరువ కావడంతో వెనువెంటనే ఎస్ఐలకు ప్రభుత్వం కల్పించిన పదోన్నతులలో సైతం సిఐగా స్థానం లభించింది. ఒకవైపు ప్రశంసలు, మరో వైపు పదోన్నతి లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## తుది ఓటరు జాబితా తయారుకు సహకరించండి..!
తహశీల్దార్ శిరీషా

**చంగ్రిరి, ఆగస్టు 17 ప్రభాతవార్త:**



తుది ఓటరు జాబితా తయారుకు ప్రతి ఒక్క బిఎల్ఓ సహకరించాలని తహశీల్దార్ శిరీషా అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం బిఎల్ఓలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నదే తక్కువ సమయం ప్రతి ఒక్కరూ డోర్ టు డోర్ వెరిఫికేషన్‌లో ప్రమాణాలు పాటించి త్వరితగతిన జాబితా రూపొందించడానికి కృషి చేయాలన్నారు. వెరిఫికేషన్‌లో ఎటువంటి పొరబాట్లకు అవకాశం లేకుండా డబుల్ ఎంట్రీలు, డెత్ ఓటర్లను తొలగించాలన్నారు. కొత్త ఓటరు నమోదు పారదర్శకంగా జరగాలన్నారు. వెరిఫికేషన్‌లో ఎటువంటి అనుమానాలు తలెత్తినా మీకు సమీపంలో గల అధికారుల దృష్టికి తీసుకెళ్ళి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీలు తహశీల్దార్ మోహన్ రెడ్డి, అమృత, ఆర్ఐ సులోచన, ఏఎస్ఓ స్వర్ణలత, ఎస్ఏ ఉషారాణి, జెఏ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## అభిమాన నాయకుడు చెవిరెడ్డికి శుభాభినందనలు

**చంద్రగిరి, ఆగస్టు 17 ప్రభాతవార్త:**



తమ అభిమాన నాయకుడు తుడా ఛైర్మన్, చంద్రగిరి వైసిపి ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి వైసిపి చంద్రగిరి మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు సూరి, మైనార్టీ విభాగం నాయకుడు షేక్ సిద్ధిఖ్ భాషా దుశ్శాలువ అలంకరించి శుభాభినందనలు తెలిపారు. తుడా ఛైర్మన్‌గా నియమితులైన శుభసందర్భంగామరిన్ని ఉన్నత పదవులుఅలంకరించిప్రజానాయకుడుగారాణించాలని ఆకాంక్షించారు.మీవెంటేమాప్రయాణంఅంటూఉద్ఘాటించా రు

## ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం..!
వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

**రామచంద్రాపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త:**



అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. గొల్లపల్లి, సూరావారిపల్లి, ఆముదాలపల్లి, రేణుకాపురం, తిమ్మరాజుపల్లి, తిమ్మరాజుపల్లి ఏఏడబ్ల్యులో గురువారం గడపగడపకు హర్షిత్ రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏవి బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, ఎంపిటిసిలు మంజుల సిద్దారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఎద్దల రాజేష్, బీకిరెడ్డి వైసిపి నాయకులు రామిరెడ్డి, యశ్వంత్ రెడ్డి, ధనంజయ రెడ్డి, బాల, కాయం చిరంజీవి, వాసు, తదితరులు పాల్గొన్నారు.

## భూ కేటుగాళ్ళ మాయలో పడవద్దు..!
ఎంపిటిసి చంద్రశేఖర్ రెడ్డి

**రామచంద్రాపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త:**
బలిజపల్లిలో భూ కేటుగాళ్ళు రెచ్చిపోతున్నారనీ వారి మాయలోపడవద్దని సి.రామాపురం ఎంపిటిసి కొట్టే చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మీడియా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బలిజపల్లి గ్రామానికి చెందిన శ్రీహరి, రామ్మూర్తి, సుగుణ కలసి భూ మాయలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఒక పొలాన్నే పదేపదే ఇతరులకు విక్రయించి మోసాలకు పాల్పడుతూ సొమ్ముచేసుకుంటున్నట్లు ఆరోపించారు. ఇందులో భాగంగా రామూర్తి, హరి తనకు రెండెకరాల పొలం రూ.20 లక్షలకు విక్రయించి రూ.5 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నట్లు ఎంపిటిసి తెలిపారు. అయితే తనకు విక్రయించిన పొలం వద్దకు వెళ్ళగా ఆ పొలం తమదంటూ తిరుపతికి చెందిన కొందరు తనను అడ్డుకుని దాడికి యత్నించినట్లు వాపోయారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోకనాథం, రమేష్, చిట్టిబాబు, శ్రావణ్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వికులను స్మరించుకోవడం మన ఆచారం
ఎంఎల్‌సి మేరుగ మురళీధర్

**రామచంద్రాపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త:**



పూర్వికులను స్మరించుకోవడం మన ఆచారమని గూడూరు ఎంఎల్‌సి మేరుగ మురళీధర్ అన్నారు. తనకు రాజకీయ భిక్షను ప్రసాదించిన తిమ్మరాజపల్లిలోని తన పెదనాన్న మేరుగ రామకృష్ణయ్య, మేరుగ నాగరాజు, అవ్వ, తాతలు కమలమ్మ, చెంగయ్య, దేవరాణి, మాదవ రెడ్డిల సమాధులకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి, నివాళులర్పించారు. తనపై నమ్మకంతో రాజకీయాలలోకి తీసుకువచ్చిన పెద్దల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాసేవ చేయడంలో నిత్యం నిమగ్నం కాగలనన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మామిడి లీలాకృష్ణ, మేరుగ తారక రాము, ఎస్వీయు ప్రొఫెసర్ మేరుగ బాలాజీ, సిటిఓ మేరుగ వాసుదేవరాజు,తదితరులు పాల్గొన్నారు.

## 28న నగరికి ముఖ్యమంత్రి జగన్ రాక
న అధికారులకు కేటాయించిన విధులను జాగ్రత్తగా నిర్వహించాలి - జాయింట్ కలెక్టర్

నగరి, ఆగస్టు 17 ప్రభాతవార్త: ఈ నెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నగరి పర్యటనను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఉదయం నగరి మున్సిపల్ సమావేశ హాలులో జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశం హాలులోజడ్పీసీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీవోలు నగరి, కుప్పం సృజన, శివయ్యలతోకలసి ఈ నెల 25న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నగరి పర్యటనకి సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై అన్ని శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ నెల 25న నగరి పట్టణంలో జగనన్న విద్యా దీవెన పంపిణీ కార్యక్రమానికి రాక సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని వారికి కేటాయించిన పనులను పూర్తి చేయాలన్నారు. అధికారులందరూ సమన్వయంతోపని చేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు.

# స్మగ్లర్ల కారణంగానే జనారణ్యంలోకి పులులు

**-కర్ర పులి ఆటతో భయపడుతున్న భక్తులు -ఇంత దారుణ ఘటన జరిగితే ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది -బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి**



తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 17 ప్రభాతవార్త: తిరుమల కాలినడక మార్గంలో వరుసగా చిరుత పులులు చిన్నారులపై దాడులు చేయడానికి ప్రధాన కారణం ఎర్రచందనం స్మగ్లర్లేనని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. గురు వారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ శ్రీవారికి అత్యంత పవిత్రమైన మొక్కు కాలినడకన తిరుమల చేరుకుని,తలనీలాలు సమర్పించి ఆ కలియుగ వైకుంఠుని దర్శనం చేసుకోవడం భక్తులకు అనాదిగా వస్తున్న ఆచారమన్నారు.అలాంటిది టిటిడి,ఫారెస్ట్ అధికారుల తీరుతో భక్తులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు.మనుషుల మధ్య ఉండాల్సిన ఎర్రచందనం స్మగ్లర్లు అడవుల్లో ఉండటం కారణంగా,అడవుల్లో ఉండాల్సిన క్రూర జంతువులు జనారణ్యంలోకి వస్తున్నాయన్నారు.జూన్ 22న కర్నూలుకు చెందిన కౌశిక్ అనే మూడేళ్ల బాలుడిపై చిరుత దాడి చేసిన ఘటన మరవకముందే,సరిగ్గా నెలన్నర రోజుల్లోనే లక్షిత అనే ఆరేళ్ల బాలికపై దాడి చేసి చంపేసిన ఘటన జరగడం బాధాకరమన్నారు.ఈ నెలన్నర రోజుల్లో భక్తుల భద్రత పట్ల ఇటు టిటిడి అటు అటవీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఆయన ప్రశ్నించారు.ఇప్పుడు కొత్తగా పులుల నుండి రక్షణ కోసం ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఊతకర్రలు ఇవ్వడం చూస్తుంటే కర్ర–పులి ఆటలా ఉందని ఎద్దేవా చేశారు.అలిపిరి కాలిబాటలో మోకాళ్లపర్వతం వరకు ఎలాంటి ప్రమాదం లేదని, కారణం వరుసగా దుకాణాలు, నిత్యం మనుషులు ఉంటారు. అయితే ఏడవ మైలు నుండి నరసింహస్వామి ఆలయం వరకు మధ్య మాత్రమే చిరుత పులులు సంచరిస్తున్నాయి. భక్తుల రక్షణ కోసం ఎంతమంది సిబ్బందిని ఆ మధ్య దూరంలో ఏర్పాటు చేశారని నిలదీశారు.ఇంత దారుణమైన ఘటన జరిగితే కనీసం అటవీశాఖ మంత్రి కానీ,ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కానీ ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలన్నారు. ఎర్రచందనం స్మగ్లర్ల నుండి వాటాలు,కోటాలు వస్తున్నాయి కాబట్టే మౌనం దాల్చుతున్నారని అర్థమవు తోందన్నారు. ఇప్పటికి 5వేల కోట్ల విలువగల ఎర్రచందనం పట్టుకున్నామని అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా లక్ష కోట్లకు పైగా ఎర్రచందనం ఇతర దేశాలకు,ప్రాంతాలకు తరలింపబడుతోందన్నారు. దీనిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే జ్యూడీషియల్ ఎంక్వరీ వేయాలని,అలా జరిగితే ఎందరో అధికారులు,వైసిపి ముఖ్య నేతలు జైలుకెళ్లడం తథ్యమన్నారు.ఇప్పటికైనా టిటిడి,ఫారెస్ట్ అధికారులు సమన్వయంతో భక్తుల రక్షణ,భద్రత కోసం శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

## శ్రీద్రౌపదీదేవికి పుష్పాలంకరణ



పుత్తూరురూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి ఆలయంలో గురు వారం అమ్మవారికి విశేష అభిషేకాలు, పుష్పాలంకరణతో అలంకరించి పూజలు చేశారు. ఈ కార్యక్రమం ఉభయ దాతగా పుత్తూరు బలిజ వీధికి చెందిన రాజమహేంద్ర, దిలీప్‌లు వ్యవహరించారు. అలాగే అరుణానది తీరమున శ్రీ ద్రౌపదీ దేవి అమ్మవారు జనన స్థలంకు వెళ్లి పూజ, హారతి కార్యక్రమం చేపట్టి చౌటూరు, పరిసర గ్రామ భక్తుల నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సారెగైకుని వచ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతగా వన్నియ రెడ్ల సంఘం, చౌటూరు గ్రామస్థులు వ్యవహరించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతలుగా ద్వారకానగరం రజనికాంత్, యువరాజు, చౌటూరు ధరణి మూర్తి, శరత్‌కుమార్‌లు ఆధ్వర్యంలో జరిగింది. అలాగే రాత్రి శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ భగవాన్ ఉత్సవ విగ్రహాలతో వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక సాంస్కృతి కార్యక్రమాల నడుమ భజన చేస్తూ యాదవకుల సాంప్రదాయ మేళ తాళాలతో వైభవంగా పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీకృష్ణ యాదవ ఉద్యోగుల సేవా సంక్షేమ సంఘం, పుత్తూరు, పరిసర యాదవ ప్రముఖుల వారి సౌజన్యంతో ప్రముఖ న్యాయవాది బి.రవీంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బి.ఎస్.మోహన్, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల,ఆగస్టు 17ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారిని గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో సినీప్రముఖులు దర్శించుకున్నారు. సినీనటుడు మంచు విష్ణు, కేరళ నటుడు ఉన్నికృష్ణన్ ముకుందన్ నాయర్ కుటుంబంతో కలసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## స్వచ్ఛ సర్వేక్షన్ పనులు పరిశీలించిన కేంద్ర బృందం



విజయపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త : మండలంలోని శ్రీహరిపురంలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా నిర్వహించిన పనులను గురువారం కేంద్ర బృందం పరిశీలించింది. అందులో భాగంగా అంగన్ వాడి కేంద్రాలను, పంచాయతీ భవనం, పాఠశాలలో నిర్వహించిన పనులను పరిశీలించారు. గ్రామాల్లో 15 కుటుంబాలను కలిసి మరుగుదొడ్ల వినియోగాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరు మరుగుదొడ్లను వినియోగిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేంద్ర బృందం నాయకుడు రామ్మోహన్, సర్పంచ్ జ్యోతి, ఇఒ పిఆర్‌డి బాబు తదితరులు పాల్గొన్నారు.

## 21లోపు ఎస్‌ఎస్‌ఆర్ 2024సర్వే పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి**



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 17 ప్రభాతవార్త : బిఎల్‌ఓలు తమ విధుల్లో అధిక ప్రాధాన్యత ఎన్నికల విధు లకు ఇవ్వాలని, ఈ నెల 21 లోపు వందశాతం ప్రత్యేక ఓటర్ల సవరణ 2024 సర్వే పూర్తి చేయాలని ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో, ఇఆర్‌ఓ, ఎఇఆర్‌ఓలతో ప్రత్యేక ఓటర్ల సవరణ 2024పై నాల్గవ సారి సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బిఎల్‌ఓలు ప్రత్యేక ఓటర్ల సవరణ 2024 మేరకు వారి పరిధిలో ప్రతి ఇంటిని సమగ్ర ఓటరు సర్వే చేపట్టాలని, జిల్లాలోని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ప్రతి రోజు సమీక్ష నిర్వహిం చాలని అన్నారు. ఈ నెల 21 నాటికి ఎన్నికల కమిషన్ సూచనలు సర్వే పూర్తి చేయాలని అన్నారు. బిఎల్‌ఓల పర్యటన సమయం బిఎల్‌ఎలకు తెలియజేయాలని అన్నారు. ప్రత్యేక ఓటర్ల సవరణ 2024 సర్వే చేపట్టి ఫ్రీ అండ్ ఫేర్ ఓటర్ల జాబితా లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు. జిల్లాలో 7 నియోజకవర్గాల్లో ఆన్‌లైన్ నమోదు ప్రకారం 668526 గృహాలకు గానూ 492681 కుటుంబాలు సర్వే పూర్తి అయ్యాయని, మాన్యువల్‌గా సేకరించినవి కూడా నమోదు చేయాలని వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు వ్రాతపూర్వకంగా అందించిన ఫిర్యాదులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, చర్యలు చేపట్టాలని అన్నారు. ఇఆర్‌ఓలు బిఎల్‌ఓ వారిగా సర్వే చేస్తున్న శాతాన్ని పరిశీలించి అలసత్వం వున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, డిఆర్‌ఓ కోదండరామిరెడ్డి, ఇఆర్‌ఓలు కిరణ్ కుమార్, రామారావు, చంద్రముని, కనక నరసారెడ్డి, నగరపాలక డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బిజెపి వరప్రసాద్, టిడిపి సుధారెడ్డి, కాంగ్రెస్ చింతామోహన్, వైఎస్‌ఆర్‌సిపి చంద్రారెడ్డి, ఎఇఆర్‌ఓలు, తహశీల్దార్లు వెంకటరమణ, జరీన బేగం, శిరీషా, ఎన్నికల తహశీల్దార్ సురేష్, డిటిలు కిరణ్మయి, విజయభాస్కర్, జీవన్‌లు పాల్గొన్నారు.

## 25న సామూహిక వరలక్ష్మీ వ్రతం

శ్రీకాళహస్తి,ఆగస్టు 17 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంప్రదాయాలు, ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్య కల్పిస్తున్నారు.ఈ నేపథ్యంలో సంత్సరాల తరబడి నిర్వహిస్తున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఈ నెల 25న నిర్వహించుటకు నిర్ణయించినట్లు ఆలయ ఇఒ కె.విజయసాగర్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.అయితే గతంలో ప్రసన్న వరదరాస్వామి ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో నిర్వహించే వ్రతాన్ని ఈ సారి బ్రహ్మగుడి ఆవరణలో నిర్వహించుటకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మార్పును మహిళా భక్తులు గుర్తించాలని కోరారు. ఉదయం7 గంటల నుంచి ప్రారంభం అవుతుందని ఇఒ ప్రకటించారు.

## స్థానిక నాయకులు లేకనే పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీకాళహస్తి,ఆగస్టు 17 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణరావు రాక సందర్భంగా శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి న భూతో అన్నట్లు సుమారు కిలో మీటర్‌కు పైగా స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు. అయితే మంత్రి సత్యనారాయణ పట్టు వస్త్రాల సమర్పణ సందర్భంగా ఇటు శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి కాని అటు ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు లేకపోవటం గమనించదగ్గ విషయం.అయితే ధర్మకర్తల మండలి ఛైర్మన్ కుమాత్రం ఉదయం 7గంటలకని దేవస్థానం అధికారులు సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు.కానీ ఆయన 6.45 గంటలకు ఆలయానికి రాగా అప్పటికే మంత్రి స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి అభిషేకం జరిపించుకొని ఆశీర్వచనానికి వచ్చినట్లు తెలిసింది.అక్కడ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు చేరుకున్నారు.తరువాత ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధనరెడ్డి స్వామి గర్భగుడి వద్ద అభిషేకానికి కలుసుకొని సభావేదిక వద్దకు తీసుకెళ్ళారు. మరి నాయకులకు సంబంధించి దేవాదాయశాఖ కమిషనర్ కానీ,దేవాదాయశాఖ సహాయ సంచాలకులు ఎందుకు పట్టించుకోలేదు? అనేది మరో శేషప్రశ్న.ఇన్ని జరుగుతున్నా ఇక్కడ పని చేసే ఆర్‌జెసి సాగర్‌బాబు ఎందుకు ప్రేక్షకునిలా మారారు? మాసోత్సవాలు కేవలం అధికారుల కార్యక్రమాలేనా? అనే సవాలక్ష ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి.

**ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాము : అధికారికంగా దుకాణాలు మూయించలేదు**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ రాక సందర్భంగా భక్తులకు శ్రీస్వామి అమ్మవార్ల దర్శనాలకు ఎటువంటి అంతరాయం లేకుండా ముందస్తుచర్యలు తీసుకున్నాము తప్ప దుకాణాలను మూయమని ఎలాంటి అధికారికంగా ఎటువంటి ఆదేశాలు, ఉత్తర్వులు జారి చేయలేదని గురువారం దేవస్థానం ఇఒ కె.విజయసాగర్‌బాబు ఖండించారు.

## ఊంజల్‌సేవలో చాముండేశ్వరి అమ్మవారు



శ్రీకాళహస్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త : పట్టణంలోని భాస్కరపేటలో వెలసిన చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో వెలసిన అమ్మవారికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకాలంకణ చేపట్టారు. ఈసందర్భంగా అమ్మవారి ఉత్సవమూర్తికి విశేషాలంకరణ చేపట్టి పూజలు నిర్వహించడంతోపాటు ఊంజల్‌సేవను కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## నీటి దుర్వినియోగంపై మంత్రులు విచారణ జరిపించాలి

**- మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



నాయుడుపేట, ఆగస్టు 17 ప్రభాతవార్త : సోమశిల జలాశయంలో 20 టిఎంసిల నీటిని వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ఆరోపించారు. నాయుడుపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడారు. సోమశిల జలాశయంలో నీటి దుర్వినియోగంపై ఇరిగేషన్, వ్యవసాయశాఖ మంత్రులు కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు చెరువుల్లో మట్టిని తవ్వేసి కొల్లగొడుతున్నారని ఆరోపించారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతులను నష్టపరిచి వైసీపీ నాయకులు మట్టిని అమ్ముకొని కోట్లు గడిస్తున్నారని విమర్శించారు. జిల్లాలోని చిల్లకూరు, కోట మండలాల్లో సిలికా భారీ కుంభకోణం వైసీపీ ప్రభుత్వంలో జరిగిందన్నారు. సిలికా మాఫియా ద్వారా వచ్చే సంపాదనలో నగదు లోటస్‌పాండ్‌కు అందుతుందన్నారు. పేదలకు దక్కాల్సిన అసైన్‌మెంట్ భూములను కాజేసేందుకు వైసీపీ నాయకులు కుట్రపన్నుతున్నారని సోమిరెడ్డి ఆరోపించారు. జిల్లాకు చెందిన మంత్రి అక్రమ సంపాదనతో విదేశాల నుంచి సామగ్రి తెప్పించి ఇల్లు నిర్మించడం జరిగిందన్నారు. పేదలను పట్టించుకోవాల్సిన మంత్రులు, ఎమ్మెల్యేలు అక్రమ సంపాదనలో మునిగి తేలుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి శ్రీరామ్‌ప్రసాద్, టిడిపి నాయకులులు పాల్గొన్నారు.

## సామూహిక గృహప్రవేశాలకు పక్కా ఏర్పాట్లు

**- గృహనిర్మాణ శాఖ ప్రత్యేక అధికారి రామచంద్రారెడ్డి**



చిత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త: పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమంలో సామూహిక గృహ ప్రవేశాలకు సర్వం సిద్ధం చేయాలని గృహ నిర్మాణశాఖ ప్రత్యేక అధికారి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. డిఆర్‌డిఎ సమావేశ భవనంలో గురువారం గృహ నిర్మాణ శాఖ అధికారులతో హౌసింగ్ ప్రత్యేక అధికారి రామచంద్రారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రత్యేక అధికారి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 40 వేల ఇళ్ళ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యం నిర్దేశించి వుండటంతో ఆ మేరకు పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఇళ్ళ నిర్మాణాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా అగ్రస్థానంలో వుందని, ఇదే ఒరవడి కొనసాగించాలన్నారు. త్వరలో రాష్ట్ర స్థాయి కార్యక్రమంను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారని, చిత్తూరు జిల్లాలో మంత్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇళ్ళ నిర్మాణాలతో పాటు లబ్దిదారులకు పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాట్లు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, డోర్లు, లోగో కచ్చితంగా వుండేలా చూడాలని, విద్యుద్దీకరణ పనులతో పాటు ప్రతి ఇంటికి ఒక లైటు ఉచితంగా వేయించాలన్నారు. అలాగే 25 ఇళ్ళ నిర్మాణాలు, ఆపై ఇళ్ళు వున్న జగనన్న కాలనీలకు ఆర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అప్రోచ్ రోడ్ల నిర్మాణాల విషయంలో రాజీలేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాల సమూదాయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరిగా వుండేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే వర్షాకాలంలో కాలనీల్లో మురికి నీరు వచ్చే అవకాశం వుంటుందన్నారు. 458 లేఅవుట్లకు సంబంధించి 335 లేఅవుట్లలో విద్యుద్దీకరణ పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన కాలనీల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నయని ట్రాన్స్‌కో ఎస్ఇ శ్రీహరి వివరించారు. ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసుకొన్న లబ్దిదారులు దరఖాస్తు చేసిన 24 గంటల్లోపు ఉచితంగా సర్వీస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. హౌసింగ్ పిడి పద్మనాభం మాట్లాడుతూ జిల్లాలో అన్ని శాఖల సహకారంలో 38 వేల ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసుకొన్నామని, మరో 2 వేల ఇళ్ళ నిర్మాణాలు పది రోజుల్లో పూర్తి అయ్యేలా అడుగులు వేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో డ్వామా ఎపిడి వాణి, పిఆర్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, గృహ నిర్మాణశాఖ అధికారులు, ఎంపిడిఓలు, ఇతర హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తహశీల్దార్ అశోక్ కుమార్ పిళ్లై మృతి



తిరుపతిరూరల్, ఆగస్టు17 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ తహశీల్దార్ కార్యాలయంలో ఉప తహశీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న అశోక్ కుమార్ పిళ్లై బుధవారం అర్థరాత్రి మృతి చెందారు. అశోక్ కుమార్ పిళ్లైకి ఒక కుమారుడు, భార్య ఉన్నారు. గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అశోక్ కుమార్ పిళ్లై చెన్నై అపోలో హస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. తిరుపతిరూరల్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, డిప్యూటీ తహశీల్దార్‌గా విస్తృతమైన సేవలు అందించారు. ఆయన మృతికి రెవెన్యూ సిబ్బంది ప్రగాఢ సంతాపాన్ని వెల్లబుచ్చారు.

**నివాళ్ళు అర్పించిన తుడ ఛైర్మెన్ మోహిత్‌రెడ్డి :**

తిరుపతిరూరల్ డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తు, ఆకాల మృతి చెందిన అశోక్‌కుమార్ పిళ్లై పార్థివ దేహానికి గురువారం ఓటేరులో తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నివాళ్ళు అర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూమతిని తెలియజేసారు. తిరుపతిరూరల్ తహశీల్దార్ కార్యాలయంలో అశోక్ పిళ్లై రెవెన్యూ సేవలు ప్రసంశనీయమని కొనియాడారు. విషాదంలో వున్న పిళ్లై భార్యను, కుమారుడిని ఓదార్చారు. ఏ అవసరం వచ్చిన నేను అండగా ఉంటానని తుడ ఛైర్మెన్ మోహిత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## గాడిన పడిన తహశీల్దార్ కార్యాలయం

తొట్టంబేడు, ఆగస్టు 17 ప్రభాతవార్త : అవినీతి ఆరోపణలు, ఓవైపు విజిలెన్స్, మరోవైపు ఎసిబి దాడులు జరిగిన తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయం ఎట్టకేలకు గాడిలోపడింది. ఇక్కడ తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన పరమేశ్వరస్వామి ఎసిబి అధికారుల వలలో పడి సస్పెండ్ అయిన విషయం విదితమే. అప్పటి నుంచి తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయానికి రావడానికి ముందుకురాలేదు. దీంతో శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహశీల్దార్ యర్రంరెడ్డి సుధీర్‌రెడ్డి తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయంలో గత ఏడాది జూలై 4న ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన భాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ముఖ్యంగా అన్నదాతలు సమస్యలు పరిష్కరించడంలోను, ప్రభుత్వ భూములను కాపాడడంలోను ముందున్నారు. ఆక్రమణలకు అడ్డుకట్ట వేశారు. సమస్యలను పరిష్కరించడంతో సంబందిత విఆర్‌ఓలకు ఎప్పటికప్పుడు సూచనలిస్తూ వారిచే సమర్ధవంతంగా పనులు చేయించుకుంటూ ముందుకుసాగుతున్నారు. దీంతో కార్యాలయంలో ఎలాంటి సమస్యలేకుండా ముందుకు వెళ్తున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో అందరి అధికారులతో సమన్వయంతో ముందుకుసాగుతూ ఉన్న ఆయనకు 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ తహశీల్దార్‌గా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లతో పాటు ఏఅధికారి వచ్చినా వారు అడిగిన సమాచారాన్ని అందించడంలో ముందున్నారు. ఇక కార్యాలయ సిబ్బందికి మంచినీటి సమస్య ఉండడంతో గమనించిన ఆయన ఆవరణలో ఉన్న బోరును మరమ్మత్తులు చేసి మంచినీటి సమస్యను పరిష్కరించారు. ఇక సచివాలయాలు, మీసేవల నుంచి వచ్చే రైతుల వినతులను సమగ్రంగా విచారణ చేసి వారిని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. ప్రస్తుతం రీసర్వేలో కూడా సర్వేయర్లకు జిల్లా కలెక్టర్,ఆర్డీవో ఆదేశాల మేరకు తగిన సూచనలిస్తున్నారు. ఇక ఎప్పటి నుంచో ఉరుస్తున్న రికార్డు గదికి మోక్షం కలిగించడానికి చర్యలుతీసుకుంటున్నారు. వర్షం వచ్చిందంటే రికార్డులుతడవకుండా వాటిపై పట్టలు, గిన్నెలు, తట్టలు పెట్టుకునే దుస్థితి చోటుచేసుకుంది. ప్రస్తుతం ఈగదిలో ఉన్న రికార్డులన్నీ కార్యాలయంలో ఉన్న హాలులో భద్రపరచి రికార్డు గదికి మరమ్మత్తులు చేయించే పనులను చేపట్టారు.ఇక గదిలో చెదలు పట్టకుండా ప్రత్యేకంగా ఉండే మందులను కొట్టిస్తున్నారు. ఇది సుధీర్‌రెడ్డి ఘనత అని చెప్పవచ్చును. ఇక పనిచేయని సిబ్బందితో ఎలా పనులు చేయించుకోవాలో ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. మండలంలో 41రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. విఆర్‌ఓల సంఖ్య తక్కువగా ఉన్నా ఇన్‌ఛార్జిల విఆర్‌ఓలను నియమించి పనులు చేయించుకుంటున్నారు. ఇక ఓటరు నమోదును సమగ్రంగా నిర్వహించాలంటూ బిఎల్‌ఓలను ఆదేశించారు. ఏది ఏమైనా తొట్టంబేడు మండలంలో సుధీర్‌రెడ్డి మార్కు పాలన ఉండడంతో ఇటు రైతులు, ప్రజలు, నాయకులు ఓమంచి అధికారిని నియమించినందుకు సంతోషపడుతున్నారు.

## శబరిమలైలో అయ్యప్పను దర్శించుకొన్న మంత్రి పెద్దిరెడ్డి



చిత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త: అయ్యప్ప స్వామి దీక్ష ముగింపు సందర్భంగా రాష్ట్ర భూగర్భ గనులు, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం శబరిమలైలో అయ్యప్ప స్వామిని దర్శించుకొన్నారు. చిత్తూరు జిల్లా నుండి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్‌లు ఇరుముడి ధరించి పంబా చేరుకొని నడక మార్గంలో శబరిమల చేరుకొని అయ్యప్ప స్వామిని దర్శించుకొని మాలను ముగించారు.

## త్వరలో ఆడిటోరియం ప్రారంభిస్తాం : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 17 ప్రభాతవార్త : నగరంలో నిర్మిస్తున్న ఆడిటోరియం నిర్మాణ పనులు పూర్తి అయిందని త్వరలోనే ప్రారంభించనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. గురువారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆడిటోరియం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. సుమారు 40 కోట్ల రూపాయిలు స్మార్ట్ సిటీ నిధులతో తుడా కార్యాలయం సమీపంలో 600 మంది కూర్చుని కార్యక్రమాలు వీక్షించేందుకు వీలుగా ఆడిటోరియం, కమాండ్ కంట్రోల్ సెంటర్, ఆర్ట్ స్టూడియో, డిజైన్ స్టూడియోను నిర్మిస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు ఆడిటోరియం, ఆర్ట్ స్టూడియో పనులు పూర్తి అయ్యాయని, త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తామని అన్నారు. ఈ ఆడిటోరియం రాకతో నగరంలో సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి ఎంతో బాగుంటుందని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిఈ దేవిక, ఏఈకాం ప్రతినిధులు బాలాజీ, అనిల్, తదితరులు ఉన్నారు.

## అమ్మవారి ఆలయంలో వర్చువల్ కల్యాణోత్సవం

**సోమవారం నుండి శుక్రవారం వరకు ఆన్‌లైన్‌లో టికెట్లు జారీ**



తిరుచానూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ప్రతి రోజు నిర్వహించే అమ్మవారి కల్యాణోత్సవంలో భక్తులు వర్చువల్‌గా పాల్గొనే అవకాశం టిటిడి కల్పిస్తోందని ఆలయ అధికారులు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వర్చువల్ విధానంలో భక్తులు పాల్గొనేందుకు వీలుగా సోమవారం నుండి శుక్రవారం వరకు ఈ టికెట్లను టిటిడి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. రూ 500 చెల్లించి భక్తులు టికెట్ కొనుగోలు చేయవచ్చన్నారు. వర్చువల్ టికెట్లు పొందిన భక్తులకు టికెట్టు పొందిన తేది నుండి 90 రోజులలోపు గృహస్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. వీరికి ఒక ఉత్తరియం, రవిక, లడ్డూ, వడ బహుమానంగా అందిస్తారన్నారు. సుదూర ప్రాంతాల నుండి తిరుచానూరువచ్చి అమ్మవారి కల్యాణోత్సవంలో పాల్గొన లేని భక్తుల కోసం టిటిడి వర్చువల్ కల్యాణోత్సవం ప్రవేశపెట్టింది. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని టిటిడి కోరారు.

## వెంకటగిరి నియోజకవర్గంలో చౌక బియ్యం...బ్లాక్ మార్కెట్‌కు తరలింపు

**-మద్రాస్‌కు తరలించే... అధిక శాతం వెంకటగిరి నియోజకవర్గం రేషన్ బియ్యం -పట్టించుకోని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు**

వెంకటగిరిరూరల్ ఆగస్టు 17 ప్రభాతవార్త:వెంకటగిరి నియోజకవర్గంలో అధిక శాతం పేద బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ లక్షలు రూపాయలు జేబులు నింపుకొంటున్నారు.అదే విధంగా ఇంటి దొంగను ఈశ్వరుడు కూడ పట్టుకోలేడు అనే సామేత వెంకటగిరి రైస్ గోడౌన్‌లో పని చేస్తున్న కూలీలు కూడా అదే అవతరం ఎత్తి వ్యాపారులకు తోడ్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల పోదలకూరు, నెల్లూరు రైస్ మిల్లుల్లో అధికారుల తనిఖీలల్లో బయట పడ్డ అధిక శాతం బియ్యం వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి ప్రాంతాల నుంచి తరలించినట్లు సమాచారం ఎన్నో సంవత్సరాలుగా వెంకటగిరి రైస్ గోడౌన్‌లో పని చేసే సీనీయర్ కూలీలు డీలర్లుతో మాట్లడుకొని బియ్యంను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే సమాచారం. అయితే గత రెండు సంత్సరాలుగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజానీకానికి మూడు పూటల కడుపు నిండా తిండి కొరత లేకుండా సామాన్యలకు సైతం అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చౌక దుకాణాలల్లో బియ్యం ఉచితం కావడంతో, కొందరు డీలర్లు దళారులు పాలిట రైస్ గోడౌన్ కూలీలు పాలిట కల్పతరువుగా మారింది. వెంకటగిరి డక్కిలి,బాలాయపల్లి మండలాల్లో కొందరు డీలర్లు పేదలకు పంపిణి చేయకుండా అధిక ధరలకు నల్ల బజారులో, దళారులతో అధికారులు కుమ్మకై అమ్ముకొని సొమ్ము చేసుకోంటున్నరనే విమర్శలు వినిపిస్తున్నాయి. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో సమారు 127 చౌక దుకాణాలు ఉన్నాయి. కొంత మంది డిలర్లు వద్ద 3నుంచి 6 బస్తాలు బియ్యం గుడౌన్‌లోనే నిలుపుకోని వారికి 1 కేజి 10 నుంచి 15 రూపాయలు డబ్బులు చెల్లించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని తెలిసింది.

## 24న తిరుపతికి చంద్రబాబు

**-టిడిపి కార్యాలయ సమావేశంలో నేతలతో సమీక్ష**

తిరుపతి,ఆగస్టు 27 ప్రభాతవార్త: తెలుగుదేశంపార్టీ పార్లమెంట్ కార్యాలయంలో ఈ నెల 24న తెలుగుదేశం పార్టీ జోన్ 4కు సంబంధించి జరగనున్న బహిరంగ సమావేశానికి ఈ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు హాజరై మార్గనిర్దేశం చేయనున్నారు. వివిధ కీలకమైన అంశాలను నాయకులతో చర్చించనున్నారు.ఆయనతోపాటు పోలిట్‌బ్యూరో సభ్యులు,మాజీ మంత్రులు, పార్లమెంట్ అధ్యక్షులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు,35 నియోజక వర్గాల ఇన్‌చార్జులు,రాష్ట్రం నుంచి పార్టీ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు ,తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు జి నరసింహయాదవ్, సుగుణమ్మ,రాష్ట్ర పార్టీ నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, సురా సుధాకర్ రెడ్డి,పుష్పావతియాదవ్, బుల్లెట్ రమణ, గరువారెడ్డి, దంపూరు భాస్కర్ యాదవ్ ,ఆర్సీ మునికృష్ణ,పులిగోరు మురళీకృష్ణరెడ్డి,ఊకావిజయ్‌కుమార్, వట్టికుంట చినబాబు, గాలి చినబాబు,మహేష్ యాదవ్ ,మునిశేఖర్‌రాయల్, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.